

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 27-06-2026 | సంపుటి - 29 | సంచిక -35 | రూ : 4 | పేజీలు: 8


## ఆపరేషన్ సిందూర్ లో

# అమరులు ఆరుగురు

- ఏడాది తర్వాత జవాన్ల పేర్లు ప్రకటించిన కేంద్రం
- నేషనల్ వార్ మెమోరియల్ వెబ్‌సైట్‌లో
- 'రోల్ ఆఫ్ ఆనర్-2025'లో చోటు
- తెలుగు అగ్నివీర్ మురళీ నాయక్ సహా
- ఆరుగురికి దేశం నివాళి




న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆరుగురు అమరవీరుల పేర్లను కేంద్ర ప్రభుత్వం తొలిసారి అధికారికంగా వెల్లడించింది. దేశ రక్షణలో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించి వీరమరణం పొందిన ఆ జవాన్ల వివరాలను నేషనల్ వార్ మెమోరియల్ అధికారిక వెబ్‌సైట్‌లోని 'రోల్ ఆఫ్ ఆనర్2025' జాబితాలో చేర్చారు. త్వరలో న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకంలో ప్రత్యేక శిలాఫలకాలపై వారి పేర్లను శాశ్వతంగా చెక్కనున్నారు.'ఆపరేషన్ సిందూర్'లో భారత సైన్యానికి చెందిన ఐదుగురు, భారత వైమానిక దళానికి చెందిన ఒకరు వీరమరణం పొందారు. వీరిలో సుబేదార్ మేజర్ పవన్ కుమార్ (10 ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్), రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్ (4వ బెటాలియన్, జమ్మూ కశ్మీర్ లైట్ ఇన్‌ఫాంట్రీ), లాన్స్ నాయక్ దినేశ్ కుమార్ (5 ఫీల్డ్ రెజిమెంట్), హవిల్దార్ సునీల్ కుమార్ సింగ్ (237 ఫీల్డ్ వర్క్‌షాప్), అగ్నివీర్ మురళీ నాయక్ (851 లైట్ రెజిమెంట్), భారత వైమానిక దళానికి చెందిన సార్జెంట్ సురేంద్ర కుమార్ ఉన్నారు. దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన వీరి సేవలను కేంద్ర ప్రభుత్వం తరువాయి 2లో

## మూసీ నిర్వాసితులకు

# డబుల్ బెడ్‌రూం ఇళ్లు




- ప్రజల సందర్శనకు నెక్లెస్‌రోడ్డులో మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- సమీక్షలో అధికారుల్ని ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: మూసీ రివర్‌బెడ్‌లో నివసిస్తున్న వారికి మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టు కింద డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. ప్రాజెక్టు కోసం భూములివ్వడానికి ముందుకు వచ్చే వారికి టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) లేదా నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాలని సూచించారు. మూసీ తొలి దశ అభివృద్ధిపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో శుక్రవారం రాత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖ నుంచి తీసుకుంటున్న భూముల్లో ఉన్న నిర్మాణాల్ని రాష్ట్ర ప్రభుత్వమే తరలించేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు లక్ష్యాలు, చేపట్టబోయే అభివృద్ధి పనులు, భవిష్యత్‌లో రూపురేఖలను ప్రజలకు వివరించేలా నెక్లెస్‌రోడ్డులో 'మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడే మూసీ ప్రాజెక్టుపై ప్రజల అభిప్రాయాల్ని స్వీకరించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఉన్నతాధికారులు నర్సింహారెడ్డి, గౌతమి, సర్ఫరాజ్ అహ్మద్, మాణిక్‌రాజ్ పాల్గొన్నారు.

## ఆపరేషన్ అమిస్తాద్

# వెనెజువెలాకు భారత్ చేయూత



- ఐఏఎఫ్‌కు చెందిన రెండు సీ-17 విమానాల్లో వైద్య సామగ్రి
- భీష్మ క్యూబ్‌లు, మందులు, 35 టన్నుల సహాయ సామగ్రి
- బయలుదేరిన 41 మంది వైద్య బృందం
- 235కు చేరిన మృతుల సంఖ్య
- వేలాది మంది గల్లంతు
- వెనెజువెలాకు అండగా ఉంటామని భారత్ హామీ

ఢిల్లీ : వరుస భూకంపాలతో తీవ్రంగా నష్టపోయిన వెనెజువెలాకు భారత్ అండగా నిలిచింది. బాధితులకు అత్యవసర సాయం అందించేందుకు 'ఆపరేషన్ అమిస్తాద్' (స్పానిష్‌లో అమిస్తాద్ అంటే స్నేహం) పేరుతో ప్రత్యేక సహాయక చర్యలను ప్రారంభించింది. ఈ మేరకు భారత వైమానిక దళానికి చెందిన రెండు సీ17 గ్లోబ్‌మాస్టర్ తరువాయి 2లో

## వ్యాపార సులభతరానికి

# కేంద్రం బాటలు

- ఆహార భద్రత నిబంధనలను సవరించిన కేంద్ర ఆరోగ్య శాఖ
- తయారీ రంగంలో లేని సంస్థలకు రికార్డుల నిర్వహణ నుంచి మినహాయింపు
- 'ఫస్ట్ ఇన్, ఫస్ట్ అవుట్' విధానం ఇక తయారీదారులకు మాత్రమే
- వ్యాపార సౌలభ్యం పెంచడమే లక్ష్యమని స్పష్టం చేసిన ప్రభుత్వం 2లో




## ఆడబిడ్డల ఖాతాల్లో

# డబ్బులేశారా..?

- నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా
- ప్రతి ఓటునూ దగ్గరుండి మ్యాపింగ్ చేయించాలి : బీఆర్ఎస్ వర్కింగ్
- ప్రెసిడెంట్ కేటీఆర్ పరిగిలో నియోజకవర్గ స్థాయి సమావేశం



పరిగి : రాష్ట్రంలోని కోటి 67 లక్షల మంది ఆడబిడ్డల ఖాతాల్లో ఒకొక్కరికి రూ.లక్ష 50వేలు జమ చేస్తే తాను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. ప్రతి ఓటునూ దగ్గరుండి మ్యాపింగ్ చేయించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగి పట్టణ కేంద్రంలోని ఎస్ గార్డెన్‌లో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ ఎస్ఐఆర్, సభ్యత్వ నమోదు కార్యక్రమంపై కార్యకర్తలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కేసీఆర్ పరిగి వచ్చినప్పుడు 'కాంగ్రెస్‌ను నమ్మొద్దు.. నమ్మి మోసపోతే గోస పడతారు' అని చెప్పారని గుర్తు చేశారు. పరిగి అంటేనే రైతులు, రైతు బిడ్డలు ఉండే వ్యవసాయ ప్రాంతమని అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. నాట్లు వేసేటప్పుడు రైతుబంధు పడేదని, కానీ ఈ ప్రభుత్వంలో ఎందుకు పడటం లేదని ప్రశ్నించారు. భూములకు పట్టాలిస్తామని చెప్పి, పారిశ్రామిక వాడ పేరుతో, రోడ్ల పేరుతో భూములు గుంజుకుంటున్నాడని ఆరోపించారు. ఉద్దండపూర్ ప్రాజెక్టు నుంచి కాలువలు తవ్వితే పరిగికి, కొడంగల్‌కి లక్ష ఎకరాలకు నీరు వచ్చే విధంగా అన్ని సిద్ధం చేశామని అన్నారు. కానీ రేవంత్ రెడ్డి తరువాయి 2లో

## భారత్‌కు జపాన్ ప్రధాని..

### జూలై 1 నుంచి పర్యటన



- జూలై 1 నుంచి 3 వరకు భారత్‌లో పర్యటించనున్న జపాన్ ప్రధాని
- ప్రధాని మోదీతో కలిసి 16వ వార్షిక సదస్సులో పాల్గొననున్న సనాయే తకాయిచి
- రెండు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, సాంకేతికతపై చర్చలు

2లో

# సింగరేణికి 'ఆదా'యం!



- త్వరలో బెల్టు ప్రక్రియ ద్వారా బొగ్గు రవాణా
- రోజుకు రూ.10 లక్షల వరకు తగ్గనున్న ఖర్చు

మణుగూరు: భద్రాద్రి జిల్లా మణుగూరు సింగరేణి యాజమాన్యం బొగ్గు రవాణా ఖర్చును తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. గని భూగర్భం నుంచి ఉపరితలానికి 5.5 కిలోమీటర్ల దూరం బెల్టును ఏర్పాటు చేసి దాని ద్వారా బొగ్గును బయటికి తీసుకురానుంది. తరువాయి 2లో

## అంబారీపై బీబీ-కా-ఆలం

# ఊరేగింపు..

- మొహరం సందర్భంగా చార్మినార్ వద్దకు
- భారీగా తరలివచ్చిన జనం

2లో



# అంబారీపై బీబీ-కా-ఆలం ఊరేగింపు

హైదరాబాద్: హైదరాబాద్ పాతబస్తీలో చారిత్రక 'బీబీకాఆలం' మొహరం ఊరేగింపు శుక్రవారం మధ్యాహ్నం భక్తి శ్రద్ధలతో ప్రారంభమైంది. ఈ వేడుకల కోసం ప్రత్యేకంగా కేరళ నుంచి ప్రత్యేకంగా తీసుకు వచ్చిన 'శ్రీదేవి' అనే ఏనుగుపై బీబీ కా ఆలం ను ఊరేగించారు. ఈ వార్షిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. దబీర్‌పురాలో మొదలైన ఈ ఊరేగింపు చార్మినార్, గుల్జార్ హౌస్ మీదుగా సాగి చాదర్‌ఘాట్ వద్ద ముగిసింది. ఈ కార్యక్రమం సందర్భంగా భద్రతను పర్యవేక్షించడానికి భారీగా పోలీసు సిబ్బందిని మోహరించారు. ఊరేగింపు చార్మినార్‌కు చేరుకున్నప్పుడు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ 'ధట్టి'ని సమర్పించారు. పురానీ హవేలీ మీదుగా ఊరేగింపు సాగుతున్నప్పుడు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ కూడా 'ధట్టి'ని సమర్పించారు. ఆయనతో పాటు ఆయన కుమారుడు మహమ్మద్ అసదుద్దీన్, తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ ఉన్నారు. ధర్మాన్ని పాటించడం, అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడటం అనే ఇమామ్ హుస్సేన్ శాశ్వత సందేశం అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల కోసం శాంతి, మత సామరస్యం, శ్రేయస్సును కోరుతూ ఆయన ప్రార్థించారు.

*** నిజాం కాలం నాటి మొహర్రం సంప్రదాయం కొనసాగింపు**

శతాబ్దానికి పైగా ఉన్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ముకర్రం జా ట్రస్ట్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్ ట్రస్టీ నవాబ్ అబుల్ ఫైజ్ ఖాన్, పురానీ హవేలీలోని పీలీ గేట్ (ఎల్లో గేట్) వద్ద పవిత్రమైన 'బీబీకాఆలం'కు 'ధట్టి', 'నజ్రానా'ను సమర్పించారు. ఆయనతో పాటు చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ , తదితరులు ఉన్నారు. రెండవ నిజాం, నవాబ్ మీర్ నిజాం అలీ ఖాన్ బహదూర్ (ఆసఫ్ జా II) పాలనలో నిర్మించబడిన చారిత్రక 'పీలీ గేట్' (పసుపు రంగు ద్వారం), 'హవేలీ ఎఖదీమ్' (పురానీ హవేలీ)కి అసలైన ప్రధాన ద్వారంగా ఉండేది. ఇది ప్రారంభ ఆసఫ్ జాహీ కాలం నాటి అత్యంత పురాతన ,ముఖ్యమైన నిర్మాణపరమైన వారసత్వ ప్రదేశాలలో ఒకటి.

**బీబీ-కా-ఆలం చరిత్ర**

'బీబీకాఆలం' వ్యవస్థ గోల్కొండకు చెందిన షియా కుతుబ్ షాహీ పాలకుల హయాంలో ప్రారంభమైంది. అయితే, ఆసఫ్ జాహీల నిరంతర ఆదరణ, రాజ పోషణ, ఉత్సవాలలో పాల్గొనడం మరియు రాష్ట్ర ప్రజల ఆచార వ్యవహారాలలో దీనిని భాగం చేయడం ద్వారా ఇది హైదరాబాద్‌లో మొహరం యొక్క అత్యంత ప్రముఖ ప్రజా చిహ్నంగా మారింది. నిజాంలు కుతుబ్ షాహీల నుండి అనేక వ్యవస్థలను వారసత్వంగా పొందారు, వాటిలో 'బీబీకా ఆలం' ఒకటి. అయితే, ఒక రాజవంశానికి చెందిన షియా మతపరమైన చిహ్నంగా ఉన్న బీబీకాఆలామ్‌ను హైదరాబాద్‌లో అత్యంత ప్రసిద్ధ మహర్రం ఆచరణాత్మక కార్యక్రమంగా మార్చడంలో ఆసఫ్ జాహీల ఆదరణ కీలక పాత్ర పోషించింది.

## భారీ వర్ష సూచన..
# అప్రమత్తమైన ఏపీఎస్డీఎంఏ

(మొదటిపేజీ తరువాయి)
మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కూడా రానున్న కొద్దిరోజుల పాటు ఏపీలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తన నివేదికలో పేర్కొంది. ఆదివారం (జూన్ 28) కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలకు ఆస్కారం ఉందని అధికారులు వివరించారు. వర్షాలు, ఈదురు గాలుల



సమయంలో ప్రజలు చెట్లు, హోర్డింగ్‌ల కింద ఆశ్రయం పొందవద్దని సూచించారు. విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, రైతులు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

# వ్యాపార సులభతరానికి కేంద్రం బాటలు

ఢిల్లీ: ఆహార వ్యాపార రంగంలో నిబంధనల భారాన్ని తగ్గించి, వ్యాపార సౌలభ్యాన్ని (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆహార భద్రత, ప్రమాణాల నిబంధనలు 2011కు సవరణలు చేస్తూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మార్పుల ద్వారా ఆహార పదార్థాలను తయారు చేయని వ్యాపార సంస్థలకు కొన్ని ప్రధాన నిబంధనల నుంచి మినహాయింపు లభించింది. తాజా సవరణల ప్రకారం స్టాక్ రొటేషన్, రికార్డుల నిర్వహణ వంటి నిబంధనలు ఇకపై కేవలం ఆహార పదార్థాలను తయారు చేసే సంస్థలకు మాత్రమే వర్తిస్తాయి. గతంలో లైసెన్స్ పొందిన అన్ని ఆహార వ్యాపార సంస్థలు తప్పనిసరిగా రికార్డులను నిర్వహించడంతో పాటు 'ఫస్ట్ ఇన్, ఫస్ట్ అవుట్' (ఎఫ్ఐఎఫ్ఓ) లేదా 'ఫస్ట్ ఎక్స్‌పైరీ, ఫస్ట్ అవుట్' (ఎఫ్ఈఎఫ్ఓ) పద్ధతులను పాటించాల్సి ఉండేది. అయితే, ఇప్పుడు రిటైలర్లు, ఇతర అనుబంధ వ్యాపార సంస్థలకు ఈ నిబంధనల నుంచి ఉపశమనం కల్పించారు. ఆహార భద్రత, నాణ్యత, ఉత్పత్తుల ట్రేసబిలిటీ వంటి అంశాల దృష్ట్యా తయారీ రంగంలో ఈ నిబంధనలు అత్యవసరం కాబట్టి, వాటిని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మార్పుల వల్ల ముఖ్యంగా చిన్న, మధ్య తరహా వ్యాపారాలపై నిబంధనల భారం గణనీయంగా తగ్గుతుందని, వారి కార్యకలాపాలు సులభతరం అవుతాయని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. దేశంలో వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరచడం, ప్రమాద ఆధారిత (రిస్క్‌బేస్డ్) నియంత్రణను ప్రోత్సహించడమే లక్ష్యంగా చేపట్టిన విస్తృత సంస్కరణల్లో ఈ సవరణలు ఒక భాగమని స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా ఆహార వ్యాపారుల కోసం ప్రభుత్వం అనేక సులభతర చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేసింది. శాశ్వత లైసెన్సులు, రిజిస్ట్రేషన్ల జారీ, టర్నోవర్ పరిమితుల సవరణ, వీధి వ్యాపారులకు ద్వంద్వ నిబంధనల తొలగింపు, రిస్క్‌బేస్డ్ తనిఖీ వ్యవస్థ అమలు వంటివి ఇందులో ఉన్నాయని వివరించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, ఆహార వ్యాపార రంగంలోని భాగస్వాములతో విస్తృత సంప్రదింపుల తర్వాతే ఈ సంస్కరణలకు తుదిరూపు ఇచ్చామని మంత్రిత్వ శాఖ తెలిపింది. అంతేకాకుండా, అనవసరమైన నియంత్రణ భారాన్ని తగ్గిస్తూనే, సమర్థవంతమైన పర్యవేక్షణను కొనసాగించాలని నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫార్సులకు అనుగుణంగానే ఈ మార్పులు చేశామని స్పష్టం చేసింది. శాస్త్రీయ ఆధారిత నిబంధనలు, భాగస్వాముల సంప్రదింపుల ద్వారా దేశంలో ఆహార భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించింది.

## ఆపరేషన్ అమిస్తాద్
# వెనెజువెలాకు భారత్ చేయూత

(మొదటిపేజీ తరువాయి)
విమానాల్లో వైద్య బృందం, భీష్మ క్యూబ్‌లు, మందులు, ఇతర సహాయ సామగ్రిని పంపింది. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు. వెనెజువెలా ప్రజలకు ఈ క్లిష్ట సమయంలో భారత్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సహాయక బృందంలో 60 పారా ఫీల్డ్ హాస్పిటల్‌కు చెందిన 41 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో తొమ్మిది మంది వైద్యులు ఉన్నారు. అత్యవసర వైద్యం, శస్త్రచికిత్సలు, ఇతర ఆరోగ్య సేవలు అందించేందుకు వీరు సిద్ధంగా ఉన్నారు. విదేశాంగ శాఖ అందించిన సుమారు ఆరు టన్నుల వైద్య సామగ్రి కూడా వెంట తీసుకెళ్లారు. అలాగే ఆరోగ్య మైత్రి ప్రాజెక్టు కింద రూపొందించిన రెండు భీష్మ క్యూబ్‌లను కూడా పంపించారు. ఇవి విపత్తుల సమయంలో తాత్కాలిక ఆసుపత్రులుగా ఉపయోగపడే ఆధునిక వైద్య యూనిట్లు. వెనెజువెలాలో బుధవారం నిమిషం వ్యవధిలో రెండు భూకంపాలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ విపత్తులో ఇప్పటివరకు 235 మంది మృతి చెందారు. 1,500 మందికిపైగా గాయపడ్డారు. వేలాది మంది ఇంకా గల్లంతైనట్లు అక్కడి అధికారులు తెలిపారు. రాజధాని కరాకస్, లా గువైరా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా, బ్రెజిల్, మెక్సికో, అర్జెంటీనా తదితర దేశాలు కూడా సాయాన్ని ప్రకటించాయి.

# ఆడబిడ్డల ఖాతాల్లో డబ్బులేశారా?

పరిగి : రాష్ట్రంలోని కోటి 67 లక్షల మంది ఆడబిడ్డల ఖాతాల్లో ఒకొక్కరికి రూ.లక్ష 50వేలు జమ చేస్తే తాను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. ప్రతి ఓటునూ దగ్గరుండి మ్యాపింగ్ చేయించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగి పట్టణ కేంద్రంలోని ఎస్ గార్డెన్‌లో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ ఎస్ఐఆర్, సభ్యత్వ నమోదు కార్యక్రమంపై కార్యకర్తలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కేసీఆర్ పరిగి వచ్చినప్పుడు 'కాంగ్రెస్‌ను నమ్మొద్దు.. నమ్మి మోసపోతే గోస పడతారు' అని చెప్పారని గుర్తు చేశారు. పరిగి అంటేనే రైతులు, రైతు బిడ్డలు ఉండే వ్యవసాయ ప్రాంతమని అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. నాట్లు వేసేటప్పుడు రైతుబంధు పడేదని, కానీ ఈ ప్రభుత్వంలో ఎందుకు పడటం లేదని ప్రశ్నించారు. భూములకు పట్టాలిస్తామని చెప్పి, పారిశ్రామిక వాడ పేరుతో, రోడ్ల పేరుతో భూములు గుంజుకుంటున్నాడని ఆరోపించారు. ఉద్దండపూర్ ప్రాజెక్టు నుంచి కాలువలు తవ్వితే పరిగికి, కొడంగల్‌కి లక్ష ఎకరాలకు నీరు వచ్చే విధంగా అన్ని సిద్ధం చేశామని అన్నారు. కానీ రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే దాన్ని పక్కన పెట్టి కమీషన్ల కోసం రూ.4,400 కోట్లతో లిస్టు ఇరిగేషన్ తీసుకొచ్చాడని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తి చేసే దమ్ము కాంగ్రెస్ వాళ్లకి లేదని అన్నారు. లగచర్లలో భూములియమన్న పాపానికి గిరిజన ఆడపిల్లలపై దాడి చేసి, అవమానించి ఒక దుస్సాసన పర్వాన్ని సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. 36 మంది రైతులను జైల్లో పెట్టి హింసించారని ఆరోపించారు. కొడంగల్‌లో జరిగిన దుర్మార్గమే పరిగిలో కూడా జరుగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల భూములను ఇష్టానుసారంగా గుంజుకుంటున్నారని, అసైన్డ్ భూములని ఇష్టారాజ్యంగా తీసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని అన్నారు. పరిగిలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎగిరేది గులాబీ జెండానే అని దీమా వ్యక్తం చేశారు.

## భారత్‌కు జపాన్ ప్రధాని..
# జూలై 1 నుంచి పర్యటన

ఢిల్లీ: భారత్, జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు జపాన్ ప్రధాన సనాయే తకాయిచి జులై 1 నుంచి 3వ తేదీ వరకు భారత్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ పర్యటనలో భాగంగా ఢిల్లీలో నిర్వహించనున్న 16వ భారత్‌జపాన్ వార్షిక సదస్సులో ఇరు దేశాల ప్రధానులు పాల్గొంటారు. జపాన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సనాయే తకాయిచి భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. వాస్తవానికి, ఈశాన్య రాష్ట్రాల్లో జపాన్ చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు చిహ్నంగా ఈ సదస్సును గౌహతిలో నిర్వహించాలని తొలుత భావించారు. అయితే, ప్రధాని తకాయిచి పర్యటన షెడ్యూల్ మరియు ఇతర లాజిస్టికల్ కారణాల రీత్యా వేదికను ఢిల్లీకి మార్చినట్లు అధికారులు వెల్లడించారు. గత ఏడాది టోక్యోలో జరిగిన 15వ సదస్సుకు కొనసాగింపుగా ఈ సమావేశం జరగనుంది. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, సాంకేతికత మరియు ఇండోపసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వం వంటి అంశాలపై ఇరు దేశాల మధ్య ఉన్న ప్రత్యేక వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడంపై నేతలు చర్చించనున్నారు. ముఖ్యంగా ఆర్థిక భద్రత, కీలక ఖనిజాలు, ఇంధన సరఫరా వ్యవస్థల బలోపేతం మరియు రక్షణ రంగ సహకారం వంటి అంశాలు ఈ భేటీలో ప్రధాన అజెండాగా ఉండే అవకాశం ఉంది.

# సింగరేణికి 'ఆదా'యం!

మణుగూరు: భద్రాద్రి జిల్లా మణుగూరు సింగరేణి యాజమాన్యం బొగ్గు రవాణా ఖర్చును తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. గని భూగర్భం నుంచి ఉపరితలానికి 5.5 కిలోమీటర్ల దూరం బెల్టును ఏర్పాటు చేసి దాని ద్వారా బొగ్గును బయటికి తీసుకురానుంది. సింగరేణిలో ఇప్పటివరకు ఇంత పెద్దఎత్తున రవాణా చేసే పద్ధతి లేదు. మణుగూరు ఉపరితల గని 2 నుంచి బొగ్గు లోడింగ్ కేంద్రం (కేసీహెచ్‌పీ) వరకు బెల్టు ద్వారా బొగ్గు రవాణా కానుంది. మరో రెండు నెలల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రస్తుతం గని నుంచి బొగ్గును రవాణా కేంద్రం వరకు డంపర్ల (భారీ వాహనాలు)లో తరిస్తున్నారు. దీంతో డీజిల్ అధికంగా ఖర్చు అవుతోంది. పలు రకాల డంపర్లకు గంట వ్యవధిలోనే 100 నుంచి 300 లీటర్ల డీజిల్ అవసరం అవుతోంది. మణుగూరు నుంచి రోజూ ఐదు రైళ్ల (రేకులు) ద్వారా బొగ్గు రవాణా అవుతోంది. ఇన్ని రైళ్లకు రవాణా జరగాలంటే కనీసం 15 డంపర్లు 150 ట్రిప్పులు వెళ్లాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు రోజూ రూ.10 లక్షలకు పైగా ఖర్చు అవుతోంది. ఈ నేపథ్యంలో ఖర్చును తగ్గించి డీజిల్‌ను ఆదా చేసేందుకు సింగరేణి యాజమాన్యం బెల్టు పద్ధతిని తీసుకొచ్చింది.

**బెల్టు ఏర్పాటుకు రూ.148 కోట్లు**

''బొగ్గు తరలింపులో రోజువారీ ఖర్చును తగ్గించాలని రూ.148 కోట్లను వెచ్చించి బెల్టును ఏర్పాటు చేయిస్తున్నాం. దీని జీవితకాలం 40 ఏళ్లు. ముంబయికి చెందిన ఓ సంస్థకు బాధ్యత అప్పగించాం. ఈ బెల్టు ద్వారా రోజూ 25 వేల టన్నుల బొగ్గు రవాణా అవుతుంది. ఈ ప్రక్రియ సురక్షితం. ఈ పద్ధతిని బొగ్గు రవాణాకే కాకుండా మట్టి తరలించేందుకు కూడా వాడుకోవచ్చు'' అని ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు.

# కేంద్రం.. అంచనాలకు మించి యూరియా ఇచ్చింది!

*** సమర్థ పంపిణీ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే: కిషన్‌రెడ్డి**

దిల్లీ, హైదరాబాద్: అంచనాలకు అదనంగా కేంద్రం తెలంగాణకు యూరియా కేటాయించిందని, రైతులకు సమర్థంగా పంపిణీ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. ఎరువుల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ''అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నా.. తెలంగాణ సహా దేశవ్యాప్తంగా పంపిణీ చేయడానికి సరిపడా యూరియా, డీఏపీ, ఎన్‌పీకే ఎరువులు ఉన్నాయి. 202526 రబీలో తెలంగాణకు 10.40 లక్షల టన్నుల యూరియా, 1.45 లక్షల టన్నుల డీఏపీ, 7 లక్షల టన్నుల ఎన్‌పీకే ఎరువులు



అవసరమవుతాయని అంచనా వేయగా.... కేంద్రం 12.01 లక్షల టన్నుల యూరియా, 2.55 లక్షల టన్నుల డీఏపీ, 9.47 లక్షల టన్నుల ఎన్‌పీకేను సరఫరా చేసింది. ఖరీఫ్‌లోనూ ఇలానే ఇవ్వడానికి ప్రణాళికలు రూపొందించాం. రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) ఉత్పత్తి చేస్తున్న యూరియా రాష్ట్ర రైతులకు అందుబాటులో ఉంది. క్షేత్రస్థాయిలో రైతులకు సమర్థంగా పంపిణీ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే'' అని కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు.

# డ్రగ్స్‌పై కఠినంగా వ్యవహరిస్తాం.. ఉప ముఖ్యమంత్రి భట్టి

రాయదుర్గం: మాదకద్రవ్యాల (డ్రగ్స్) నివారణకు ఎంతటి కఠిన నిర్ణయాలకైనా వెనుకాడమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మత్తుపదార్థాల బారినపడి యువత విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులకు, రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో శుక్రవారం ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'సే నో టు డ్రగ్స్' పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటారని, అదేవిధంగా ప్రభుత్వం దుర్వ్యసనాల బారి నుంచి కాపాడుతుందని తెలిపారు. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే ఎంతటివారైనా సరే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ పనిచేసే ఈగల్



ఫోర్స్ సిబ్బందికి ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కల్పించేందుకు సినీ నటులు, సెలబ్రిటీలు ముందుకు రావాలని సూచించారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నివారణలో ప్రభుత్వంతోపాటు ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్రతిఒక్కరూ డ్రగ్స్ వ్యతిరేక వాలంటీర్‌గా మారాలన్నారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సినీ నటుడు రామ్ మాట్లాడుతూ.. యువకులు తాత్కాలిక ఆనందాల కోసం ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. డీజీపీ సీవీ ఆనంద్; మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేశ్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, సినీ నటి మీనాక్షి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ అనేది సరదాగా ప్రారంభమై జీవితాలను సర్వనాశనం చేసే మహమ్మారి

*** స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**




వికారాబాద్, ప్రజాస్ఫూర్తి: డ్రగ్స్ అనేది సరదాగా ప్రారంభమై జీవితాలను సర్వనాశనం చేసే మహమ్మారి అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్ నందు జుంబా, ఏరోబిక్స్, 2కే రన్ కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ,చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య , మున్సిపల్ చైర్మన్ అనన్య గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉత్సాహభరితమైన జుంబా, ఏరోబిక్స్ ప్రదర్శనలతో ప్రారంభించారు. అనంతరం స్పీకర్ జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభించారు. బ్లాక్ గ్రౌండ్ నుండి ప్రారంభమైన ఈ రన్ ఎన్టీఆర్ చౌరస్తా, బిజెఆర్ చౌరస్తా, ఎంఆర్పీ పెట్రోల్ పంపు వరకు వెళ్లి తిరిగి బ్లాక్ గ్రౌండ్‌కు చేరుకుని ముగిసింది. ప్రజలు,నాయకులు, యువత, విద్యార్థులు, పోలీసులు పెద్ద ఎత్తున పాల్గొని డ్రగ్స్ నిర్మూలనకు తమ మద్దతు తెలిపారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల ఉచ్చులో చిక్కుకుని తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ఒక కుటుంబంలో ఒక్కరు డ్రగ్స్‌కు బానిసైతే ఆ వ్యక్తితో పాటు మొత్తం కుటుంబం కూడా ఆర్థిక, సామాజిక, ఆరోగ్య పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన వ్యక్తికి సమాజంలో గౌరవం ఉండదని, అందువల్ల ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల వ్యక్తి, కుటుంబం, సమాజం తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. డ్రగ్స్‌కు ఒకసారి బానిసైన తర్వాత బయటపడటం చాలా కష్టమని, డ్రగ్స్ వ్యసనానికి గురైన కొందరు డబ్బు కోసం పెడ్లర్లుగా మారి అక్రమ మాదకద్రవ్యాల రాకెట్లలో భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్ లో విజేతలుగా నిలిచిన పోలీస్ టీమ్, రన్నరప్ మినిసిపల్ టీమ్ లకు గౌరవ అతిథిలతో ట్రోఫీ లు ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఉమా శంకర్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గుట్టూర్ ,డిటిసి డిఎస్‌పి శ్రీనివాస్ డిసిఆర్‌బి డిఎస్‌పి జనయ్య వికారాబాద్ డిఎస్‌పి అంజయ్య , ఏఆర్ డిఎస్‌పి వీరేష్ , ఎఎంసి చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహా రెడ్డి, కార్యక్రమ నిర్వహణకు సహకరించిన ఈషా హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు వెంకట్ రెడ్డి, భారత్ రెడ్డి గార్లు, నాయకులు,ప్రజా ప్రతినిధులు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, యువత, విద్యార్థులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామి మండప నిర్మాణానికి భూమిపూజ



జనగామ, ప్రజాస్ఫూర్తి : శ్రీ వీరాచల జీడికంటి శ్రీ రామచంద్ర స్వామి వారి ఆలయంలో శుక్రవారం శ్రీ ఆంజనేయ స్వామివారికి మండపం నిర్మాణం కోసం భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మండప నిర్మాణానికి కైంకర్య దాతలుగా గట్టేపెల్లి జయసాగర్, శకుంతల దంపతులు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వంశీ, మాజీ చైర్మన్ ఏలే నర్సింహ మూర్తి, ఆలయ అర్చకులు ఎం. భార్గవాచార్యులు, ఎం.మురళీకృష్ణమాచార్యులు, కే. భరత్‌తో పాటు ఆలయ సిబ్బంది మల్లేశ్, రమేష్, సందీప్ మరియు పలువురు భక్తులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన సేవలే లక్ష్యం.. ఫర్టిలైజర్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, చిట్యాల, (ప్రజా స్ఫూర్తి): చిట్యాల మండల కేంద్రంలో రైతులకు నాణ్యమైన వ్యవసాయ సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఆకా ఫార్మర్స్ సర్వీస్ సెంటర్ ఫర్టిలైజర్ దుకాణాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం ప్రారంభించారు. గుమ్మడి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ అవసరాలకు సంబంధించిన సేవలు సకాలంలో అందుబాటులో ఉండటం వ్యవసాయాభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. రైతులు నాణ్యమైన ఎరువులను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం చిట్యాల మండల కేంద్రంలో కేతిరి సరిత-అశోక్, ముసుకే నిర్మల-రాజబాబు దంపతులకు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కొత్త ఇంట్లో సంతోషంగా జీవించాలని ఆకాంక్షిస్తూ లబ్ధిదారులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో చిట్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, హౌసింగ్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌పై ఉమ్మడి పోరాటం అవసరం

*** భూపాలపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. గణేష్ చౌక్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు సాగిన ర్యాలీని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, ప్రజలు, అధికారులు, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మానవహారం నిర్వహించి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేశారు. అవగాహన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కూడా చేపట్టారు.

# ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం: బండారి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం వంటిదని కొత్తగూడెం మున్సిపల్ మాజీ సీనియర్ కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ 139వ పోలింగ్ బూత్‌లో స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీఎల్ఓ శైలజ, బీఎల్ఏ నరేష్‌లు ఓటర్లకు ఏనుమ్యరేషన్ ఫారాలు ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం సమన్వయ కమిటీ సభ్యులు, మాజీ కౌన్సిలర్ రుక్మాంగాధర్ బండారి పాల్గొని ఓటు హక్కు ప్రత్యేకతలు తెలియజేస్తూ అవగాహన కల్పించారు. నూతనంగా ఓటు హక్కు వచ్చిన వారు హక్కు వినియోగించుకోవాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఏజెంట్లు ప్రజలకు అండగా ఉంటూ ప్రతీ ఒక్క అర్హులైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని సూచించారు.

# లక్ష్మణ్‌చందా పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన నిర్మల్ జిల్లా ఎస్పీ




ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లాలోని లక్ష్మణ్‌చందా పోలీస్ స్టేషన్‌ను జిల్లా పోలీసు అధికారి డా. జి. జానకి షర్మిల శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు, బెయిల్ కేసుల నిర్వహణ, రిసెప్షన్, మాల్ఖానా, ఆయుధాగారం, సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది హాజరు రిజిస్టర్లు, పోలీస్ స్టేషన్ పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం లక్ష్మణ్‌చందా పోలీస్ స్టేషన్‌కు నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని కూడా ఎస్పీ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ సిబ్బందితో ఎస్పీ సమావేశమై వారి విధి నిర్వహణ, పని తీరుపై మాట్లాడారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ప్రతి ఫిర్యాదును చట్టప్రకారం సత్వరమే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళలు, చిన్నారులు, వృద్ధుల ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని ఎస్పీ స్పష్టం చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని,సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని ఎస్పీ డా.జి. జానకి షర్మిల సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ డా. జి. జానకి షర్మిల తో పాటు డీఎస్పీ శ్రీనివాస్, సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి, లక్ష్మణ్‌చందా ఎస్ఐ శ్రావణి , పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ బీజేపీ అధ్యక్షులు నితిన్ నబీన్ పర్యటనను విజయవంతం చేయాలి

*** జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్**



జనగామ, ప్రజాస్ఫూర్తి : భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ 29న జిల్లాకు రానున్న సందర్భంగా ఆయన పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అ ధ్యక్షులు సౌడ రమేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ బలోపేతమవుతోందని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలం గాణ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేసిందని పేర్కొన్నారు. 29న జనగామకు విచ్చేస్తున్న జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఘన స్వాగతం పలికేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి, బొజ్జపల్లి సుభాష్, బల్ల శ్రీని వాస్, సంపత్, పెద్దోజు జగదీష్, సంతో ష్, మహిపాల్, దూసరి శివకృష్ణ,సాయి తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల మన్ననలు పొందాలి




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: నాణ్యమైన సేవలు అందిస్తూ వినియోగదారుల మన్ననలు పొందాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎస్ ఐ కేర్ & ఆప్టికల్స్ దుకాణాన్ని వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏ వ్యాపారమైనా వినియోగదారుల మన్ననలతోనే అభివృద్ధి చెందుతుందని అన్నారు. నాణ్యత కలిగిన కళ్లద్దాలను అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్ లు గుణగంటి హేమ సతీష్, కొండపల్లి దిలీప్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ ఆలీ, చింతమళ్ళ రమేష్, విద్యాసాగర్, సతీష్, మున్నా, సాయి, ప్రసాద్, నిర్వాహకులు మధు, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో కోతుల్‌గావ్..

*** ఎమ్మెల్యే చేతుల మీదుగా రూ.45 లక్షల మంజూరు పత్రం అందజేత**



ప్రజా స్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని కోతుల్‌గావ్ గ్రామ ప్రజల రాకపోకల సౌకర్యార్థం రూ.45 లక్షల వ్యయంతో నిర్మించనున్న కల్వర్టుకు ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ మంజూరు పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. ఈ కల్వర్టు నిర్మాణం పూర్తయితే కోతుల్‌గావ్ గ్రామ ప్రజలకు రవాణా సమస్యలు తొలగి, రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చందూ రెడ్డి, రమేష్ గౌడ్,చత్రాజీ, బెల్తరోడ సర్పంచ్ గోప సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి పిటిషన్ల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన జిల్లా ఎస్పీ




ప్రజాస్ఫూర్తి, భైంసా: జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలు, పెండింగ్‌లో ఉన్న పిటిషన్ల పురోగతిపై జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను ప్రత్యేకంగా సమీక్షించి, వాటి విచారణను వేగవంతం చేయాలని సూచించారు.ప్రతి ప్రజావాణి పిటిషన్‌పై ఎప్పటికప్పుడు ఫాలోఅప్ నిర్వహించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజావాణి కార్యక్రమం కీలకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ డా.జి. జానకి షర్మిల, సూచించారు.

# ముంజాల ఐలయ్య విగ్రహావిష్కరణ

**బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే జీఎస్ఆర్ పరామర్శ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, టేకుమట్ల, (ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్ఆర్) శుక్రవారం టేకుమట్ల మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బోర్నపల్లి గ్రామంలో ముంజాల రవీందర్ గౌడ్ తండ్రి, దివంగత ముంజాల ఐలయ్య గౌడ్ సంవత్సరికం సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి నివాళులర్పించారు.అనంతరం వెల్లంపల్లి గ్రామానికి చేరుకుని ఇటీవల మృతిచెందిన మాజీ సర్పంచ్ ఓరుగంటి సదాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే గంపల ఐలయ్య కుటుంబాన్ని ఓదార్చి, వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.తదుపరి గోరి మండలం చెన్నాపురం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఓన్నాల మొగిలి కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిమెంట్ లోడు లారీ అదుపుతప్పి డ్రైవర్ దుర్మరణం

లింగాల ఘణపురం / జనగామ, ప్రజస్ఫూర్తి : మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న సిమెంట్ లోడు లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన నవాబుపేట లో చోటు చేసుకుంది. జిల్లాలో ని లింగాల ఘణపురం మండలం, నవా బుపేట గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకకు చెందిన కెఎ 34 సీ 8601 నంబర్ గల లారీ సాగ ర్ సిమెంట్ కంపెనీకి చెందిన సిమెంట్ లోడుతో సూర్యాపేట నుంచి జనగామ వైపు వెళ్తోంది. గురువారం రాత్రి సుమారు 10 : 30 గంటల సమయంలో నవా బుపేట గ్రామ సమీపంలోని మలుపు వద్ద అతివేగంతో వెళ్తు న్న లారీ అదు పుతప్పింది. ప్రమాదాన్ని గుర్తించిన డ్రైవర్ కదులు తున్న లారీ నుంచి దూకేందుకు ప్రయత్నించగా, కింద పడి పోయాడు. అదే సమయంలో లారీ అతని పై బోల్తా పడటంతో తీవ్ర గాయా లపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రుషికేష్ కైలాస్ మార్కామ్ (30) తండ్రి కైలాస్,మహారాష్ట్ర రాష్ట్రా నికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. సమా చారం అందుకున్న లింగాల ఘణపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరు కుని మృతదేహా న్ని స్వాధీనం చేసుకు ని పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రవణ్ కుమార్ తెలిపారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: యూత్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. పార్టీకి యూత్ కాంగ్రెస్ నాయకులు చాలా ముఖ్యమని అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నందు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాదిలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలని అన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను పేదలకు కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 175 కోట్లు ఖర్చు చేస్తుందని అన్నారు. ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నూతనంగా జరుగుతున్న ఎస్ఐఆర్ సర్వేలో కాంగ్రెస్ పార్టీ తరపున బిఎల్ ఎ ల నియామకం జరిగిందని, ప్రతి బూతులో కూడా ఏ ఒక్క ఓటు కూడా తీసివేయకుండా పనిచేయాలని ఆయన అన్నారు. ఎస్ఐఆర్ పై పార్టీ పరంగా వస్తున్న సమాచారాన్ని పార్టీ కార్యకర్తలకు అందించాలని , ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో క్రియాశీలకంగా పనిచేయాలని అన్నారు. యూత్ కాంగ్రెస్ పట్టణ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి మరియు గ్రామాలలో కూడా అధ్యక్షులు , ఉపాధ్యక్షులు కార్యదర్శి పోస్టులకు యూత్ కాంగ్రెస్ నాయకులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన అన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని తన తండ్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులను ఆదరించే వారిని, వారికి పార్టీలో ప్రాధాన్యత కల్పించారని తాను కూడా అదే బాటలో పయనిస్తాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరకుంట్ల వేణుగోపాల్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎలిమినేటి సురేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ అలి, పార్టీ నాయకులు వీరన్న నాయక్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, అబ్దుల్ రహీం, కౌన్సిలర్ లు కొండపల్లి దిలీప్ రెడ్డి,, నాగుల వాసు, సునీల్ రెడ్డి , తన్వీర్ హుస్సేన్, పోలగాని బాలు గౌడ్, మహిళా కాంగ్రెస్ నాయకులు వేములకొండ పద్మ, శ్రావ్య రెడ్డి, బొడ్డు సాయి, జవహర్ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మన గుర్తింపుకై మన సమస్యలపై మన హక్కుల సాధనకై. మరో భూ పోరాటానికి పిలుపునిచ్చిన. టిఆర్ఎస్ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. పార్టీలకతీతంగా ఉద్యమకారుల,వివిధ కుల సంఘాల ఉద్యమకారులు, ప్రజా సంఘాల ఉద్యమకారుల మద్దతు ఇవ్వాలని కోరుచు శుక్రవారం మానుకోట గడ్డపై ఉన్నటువంటి ఉద్యమకారుల మద్దతు కోరుతూ వచ్చే నెల జూలై 2 తారీఖున హైదరాబాదులోని ఉప్పల్ బాగాయత్ లో భూ పోరాటానికి భారీ ఎత్తున ఉద్యమకారులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని భూ పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రక్షణ సేన పార్టీ నుంచి రంజిత్ కుమార్,మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సామ అంజి రెడ్డి,కొత్తగట్టు యాకయ్య,పెరుమళ్ళ రాజేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మనుకోట ఉద్యమకారులు గంధసిరి వేణు టిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్,బొర్రాజు లింగన్న ఉద్యమకారుల ఫోరం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు,ఉద్యమకారులు హైమద్ ఖాన్ ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్,పుచ్చకాయల రామకృష్ణ,వీరబోయిన నరేష్ యాదవ్,చిలకల రాజేష్, దేశగాని కృష్ణ,ఆంగోత్ చందులాల్,దొంతు శ్రావణ్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలం

*** మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ**




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఐఐటి జె ఈఈ నీట్ శిక్షణలో అగ్రగామిగా ఉన్న రెసోనెన్స్ విద్యాసంస్థలు సూర్యాపేటలో హోటల్ శ్రీ గ్రాండ్ వేదికగా రెజొనెన్స్ ఫౌండేషన్ సెంటర్‌ను మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి బలమైన విద్యా పునాది నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సూర్యాపేటలో ఫౌండేషన్ కోచింగ్ ను అందుబాటులోకి తీసుకు వస్తున్న రెసోనెన్స్ విద్యా సంస్థలను అభినందించారు. 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. శ్రమశిక్షణతో కూడిన అభ్యాసం, స్పష్టమైన అవగాహన, సరైన మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తు విజయాలకు కీలకమని తెలిపారు. ప్రారంభ దశలోనే బలమైన పట్టు సాధించడం ద్వారా విద్యార్థులు భావనాత్మక అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోగలరని చెప్పారు. దీంతో ఇంటర్ అనంతరం ఐఐటీ జె ఈఈ నీట్ వంటి పోటీ ప్రవేశ పరీక్షలలో సులభంగా విజయం సాదించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధనా పద్ధతులు, నిరంతర విద్యా పర్యవేక్షణతో ఫలితాల ఆధారిత విద్యను అందించడానికి రెసోనెన్స్ కట్టుబడి ఉందని అన్నారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రారంభ దశలోనే ప్రిపరేషన్ మొదలుపెట్టడం, సంపూర్ణ అవగాహనతో కూడన అభ్యాసం, కేరీర్ ఆధారిత విద్యా ప్రణాళిక ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమం లో సిఏ మార్కండేయ , సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై 6 వార్డులో అవగాహన



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు,డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ సూచనల మేరకు మెదక్ పట్టణంలోని 6వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ సంగ శ్రీకాంత్, 6వ వార్డు కౌన్సిలర్ కొడకంటి హరిత ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ నియమించిన బీఎల్ఓలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు.భారత రాజ్యాంగం ప్రకారం "ఒక వ్యక్తికి ఒకే ఓటు" అనే నినాదంతో ఓటర్ల జాబితాలో పారదర్శకత ఉండాలని, అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా అన్యాయంగా తొలగించబడకుండా చూడాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గాడి రమేష్, బీఎల్ఓలు మమత, సిద్ధమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

*** ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మండలంలోని డీవీ గ్రాండ్‌లో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి జర్నలిస్టుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పాయం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విధి నిర్వహణలో ఉన్న సమయంలో, ఇతర కారణాలతో జర్నలిస్టులు మరణిస్తే వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి ఎక్స్‌గ్రేషియా అందజేస్తోందని, ప్రమాదాలకు గురైన జర్నలిస్టులకు కూడా అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ విషయంలో కొంత ఆలస్యం జరిగినప్పటికీ, అర్హులైన ప్రతి విలేఖరికి పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డులు అందించాలనేలక్ష్యంతో రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు, గృహ వసతి వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందేలా జర్నలిస్టులకు హెల్త్ కార్డుల సౌకర్యాన్ని మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయ కులు, జర్నలిస్టులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేపీఎల్ ఫైనల్‌కు చేరిన విక్టర్ 11 జట్టు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కేపీఎల్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో విక్టర్ 11 జట్టు ఫైనల్‌కు అర్హత సాధించింది. శుక్రవారం రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ క్రీడా మైదానంలో జరిగిన తొలి సెమీఫైనల్‌లో సింగరేణి బ్లాక్ డైమండ్‌పై 3 వికెట్ల తేడాతో విజయం సాధించి తుది పోరుకు చేరుకుంది. మ్యాచ్‌ను స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ చెన్నూరి శ్రీనివాస్ టాస్ వేసి ప్రారంభించారు. టాస్ గెలిచిన విక్టర్ 11 జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా, తొలుత బ్యాటింగ్ చేసిన సింగరేణి బ్లాక్ డైమండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. పవన్ (49), యుగేందర్ (44) రాణించగా, సాయి రాకేష్ (15), శ్రావణ్ (14) పరుగులు చేశారు. విక్టరీ 11 బౌలర్లలో వర్మ రెండు వికెట్లు తీయగా, నరేష్ రుద్ర, సుధాకర్, సాయి నిరంజన్, గోపాల్ తలో వికెట్ పడగొట్టారు. 146 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన విక్టర్ 11 జట్టు 19 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 148 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. మహేష్ (48), నరేష్ రుద్ర (32), సీహెచ్ రాజేష్ (24), రమణారెడ్డి (15), మహేష్ రెడ్డి (11) కీలక ఇన్నింగ్స్ ఆడారు. సింగరేణి బ్లాక్ డైమండ్ బౌలర్లలో అర్జున్ రెండు వికెట్లు తీయగా, పవన్, యుగేందర్, సాయి రాకేష్ తలో వికెట్ దక్కించుకున్నారు. ఈ విజయంతో విక్టర్ 11 జట్టు టోర్నమెంట్ ఫైనల్‌లోకి ప్రవేశించి టైటిల్ పోరుకు సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో క్రికెట్ కోచ్ సాయి నిరంజన్, పాలడుగుల శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ చెన్నూరి శ్రీనివాస్, నరేష్ రుద్ర, గురు, నాగ మోహన్, ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా పాల్గొనగా, అంపైర్లుగా దశరథ్ రజువా, హేమంత్ వ్యవహరించారు.

# ఉర్సు గుట్టపై పీరీల మటికిలకు ప్రార్ధనలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో మొహరం వేడుకల్లో భాగంగా ఉర్సు గుట్టపై పీరీల మటికీలకు శుక్రవారం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. బేతోలు గ్రామంలో ఉర్సు గుట్ట పై ఉన్న మహబూబ్ సుభాని దర్గా వద్ద అలాగే పీరీల కొట్టంలో ఉన్న అగ్నిగుండం చుట్టూ భక్తులు మటికీలతో తిరుగుతూ ప్రార్ధనలు ఫాతిహాలు నిర్వహించి. అనంతరం పానకం పంపిణీ చేశారు. మత పెద్ద షేక్ యూసుఫ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతీ ఒక్కరు ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నారు. బేతోలు గ్రామ శివారులోని ఉన్న భజన తండా, మాన్సింగ్ తండా, చంద్ర నగర్ కాలనీలలో పీరీలను ఊరేగిస్తుండగా భక్తులు రంగుల పట్టిలు, కుడకలు, బెల్లం, ఊదు, కానుకలు సమర్పించారు. చివరి రోజు బేతోలు గ్రామంలో శనివారం మొహరం (షహదత్) నిర్వహిస్తారని ముస్లిం మత పెద్దలు తెలిపారు. ఆయా వేడుకల్లో ముస్లిం మత పెద్దలు. షేక్ మస్తాన్, షేక్ మైనోద్దీన్, షేక్ షేక్అలీ, షేక్ మైబు, షేక్ జబ్బర్ మియా, బాల్ సైదు, షేక్ ఫకీర్, షేక్ మదర్, షేక్ హైమద్, షేక్ యాకూబ్ మియా, షేక్ జానీ మియా, షేక్ లతీఫ్, షేక్ ఖాదర్ బాబా, షేక్ జావిద్, షేక్ పాషా, షేక్ ఖాజా, షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ నూతన సీఎస్‌గా సంజయ్ జాజు.. ఉత్తర్వులు జారీ

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం నూతన ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా సంజయ్ జాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న రామకృష్ణారావు ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో సంజయ్ జాజును ప్రభుత్వం నియమించింది. కేంద్ర సర్వీసులో ఈశాన్య ప్రాంత అభివృద్ధి కార్యదర్శిగా పని చేస్తున్న సంజయ్ జాజును తెలంగాణ రాష్ట్రానికి పంపుతూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకొంది. కొత్త ప్రధాన కార్యదర్శి పోస్టుకు సంజయ్ జాజుతో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్‌రంజన్ పేరును కూడా సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. చివరికి సంజయ్ జాజు వైపే ఆయన మొగ్గు చూపారు. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంజయ్.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ సబ్‌కలెక్టర్‌గా, పశ్చిమగోదావరి కలెక్టర్‌గా, హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా, కమిషనర్‌గా, పౌరసరఫరాల సంస్థ కమిషనర్‌గా పని చేశారు. 2014 నుంచి కేంద్ర సర్వీసులో ఉన్నారు. సంజయ్‌జాజు 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో ఉండనున్నారు.

# ఈ నెల 29న మానుకోటకు కేటీఆర్ రాక



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి సభ్యత్వ నమోదు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పై మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మహబూబాబాద్,డోర్నకల్ నియోజకవర్గ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గంలో ఉన్న బి ఎల్ ఏ లు, సభ్యత నమోదు ప్రత్యేక కమిటీలు నియమించుకున్న ప్రతి ఒక్కరు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు మాలోత్ కవిత, ఎమ్మెల్సీ రవీందర్ రావు,మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్,రెడ్యా నాయక్ లు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ బిందు,మాజీ మున్సిపల్ చైర్మన్ రాం మోహన్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు రంగారావు,భరత్ కుమార్ రెడ్డి,పర్కాల శ్రీనివాస్ రెడ్డి, రావుల రవిచందర్ రెడ్డి,యళ్ళ మురళీధర్ రెడ్డి,ముత్యం వెంకన్న గౌడ్,తెల్ల శ్రీనివాస్,నాయని రంజిత్, మహబూబ్ పాషా, జెర్రిపోతుల వెంకన్న గౌడ్,మర్నేని వెంకన్న, మర్నేని రఘు,వెన్నమల్ల అజయ్,బొడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా పండుగను నిర్వహించాలి

**- బోయ లింగస్వామి మాదిగ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: జులై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేసి మాదిగలు పండుగ వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ పిలుపునిచ్చారు. 30సంవత్సరాల పోరాటంలో సాధించిన వర్గీకరణ ఫలితాలను మాదిగ, మాదిగ ఉప కులాలు అందిపుచ్చుకొని, ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. విద్య, ఉద్యోగం, అన్ని రంగాలలో మాదిగ జాతి అభివృద్ధి చెందాలని భవిష్యత్తు పోరాటాలలో నూతన యువతరం భాగస్వామ్యం అవ్వాలని పిలుపునిచ్చారు. తరతరాలుగా విద్యాపరంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా తీవ్రంగా వెనకబాటుతనానికి గురైన మాదిగ ప్రజలు విజ్ఞానం, నైపుణ్యం, సృజనాత్మకతలను ఆయుధాలుగా చేసుకొని అన్ని రంగాల్లో ఎదగడానికి నడుం బిగించాలని కోరారు.

# తెలంగాణలో 13 మంది ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్: తెలంగాణలో 13 మంది ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. చేనేత హస్తకళల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్‌కు బాధ్యతలు అప్పగించింది. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించిన ప్రభుత్వం.. దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శిగా ఆమెకు అదనపు బాధ్యతలు ఇచ్చింది. జీఏడీ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్‌ను నియమించింది. మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించంది. సీఎం ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్ నియమితులయ్యారు. రాష్ట్ర అటవీ ప్రధాన సంరక్షణ అధికారిగా వినయ్ కుమార్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చింది.

*** సీఎంవోలోనూ కీలక మార్పులు**

మరోవైపు సీఎంవోలోనూ కీలక మార్పులు జరిగాయి. ఈనెల 30న పదవీ విరమణ చేయనున్న సీఎస్ రామకృష్ణారావును సీఎం సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. సీఎంవో ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డిని ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా బదిలీ చేసింది. సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్‌ను నియమించింది.

# నల్గొండలో నాలుగు హత్యల కేసు ఛేదించిన జిల్లా పోలీసులు

* **నలుగురు నిందితుల అరెస్ట్, రిమాండ్**

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్గొండ పట్టణంలోని తెలంగాణ కాలనీ, సాగర్ రోడ్డులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. మృతురాలి అక్క కుమార్తె, ఆమె భర్తతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు వ్యక్తిగత కక్షలు, ఆర్థిక లావాదేవీలు, బంగారం దోపిడీ లక్ష్యంగా ఈ హత్యలకు పాల్పడ్డారని దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు. వివరాల ప్రకారం........ ఈ నెల 22న సాయంత్రం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. అనంతరం డీఎస్పీ




కె. శివరాం రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, స్థానికుల విచారణతో నిందితులైన హైదరాబాద్కు చెందిన సయ్యద్ అస్లాం (28) టాక్సీ డ్రైవర్, తబస్సుం (28) గృహిణి, మహమ్మద్ సోహైల్ (26) ఆటో డ్రైవర్, మెకానిక్, హేమంత్ కుమార్ (28) జ్యువెలరీ వ్యాపారిలను గుర్తించిన పోలీసులు నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నలుగురు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. అస్లాం అప్పులు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబాల మధ్య ఉన్న పాత కక్షలు ఈ నేరానికి దారితీశాయని పోలీసులు తెలిపారు. బాధితురాలి వద్ద ఉన్న బంగారం, నగదు సమాచారం ఆధారంగా దోపిడీ పథకం రచించినట్లు వెల్లడైంది. ముందుగా దొంగతనానికి ప్రయత్నించినా విఫలమవడంతో హత్యకు ప్రణాళిక వేసినట్లు తేలింది. అనంతరం ఇంట్లోకి చొరబడి నలుగురిపై దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో అంగీకరించారు.హత్య అనంతరం బంగారు ఆభరణాలు, నగదు, పత్రాలు తీసుకుని పరారైనట్లు, తరువాత వాటిని తాకట్టు పెట్టి డబ్బు పొందినట్లు పోలీసులు గుర్తించారు. రూ.3 లక్షల నగదు, సుమారు 5 తులాల బంగారం (కరిగించిన రూపంలో), మహీంద్రా మరాజో కారు, మూడు సెల్ ఫోన్లు, హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలున్న బట్టలు, భూమి ,బ్యాంక్ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. కేవలం మూడు రోజుల్లో కేసును ఛేదించిన ప్రత్యేక బృందాల పనితీరును ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రశంసించారు.సంబంధిత అధికారులకు రివార్డులు ప్రకటించినట్లు తెలిపారు.ఈ కేసులో నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

# చౌకబారు ఆరోపణలు మానుకోవాలి

- **పార్టీలకతీతంగా పనిచేసే గొప్ప నాయకుడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**
- **ఎస్ లింగోటం సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా చౌకబారు ఆరోపణలు చేయడం మానుకోవాలని ఎస్ లింగోటం సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ అన్నారు. చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటం గ్రామంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీలకు అతీతంగా పనిచేసే గొప్ప నాయకుడు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఏ పార్టీ సర్పంచ్ అని చూడకుండా అన్ని గ్రామాలను సమానంగా అభివృద్ధిపథంలో నడిచేందుకు కృషి చేస్తున్నారన్నారు. మౌలిక సదుపాయాల కొరత, ప్రజలకు అత్యవసరంగా అభివృద్ధి అవసరమో అక్కడే మొదట ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పక్షపాతం చూపించే వ్యక్తి అయితే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి గురించి మాట్లాడే పరిస్థితి కూడా ఉండేది కాదన్నారు. కానీ, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి పార్టీలు, జెండాలు, వర్గాలు కనిపించవని పేర్కొన్నారు. ప్రజలు కష్టాల్లో ఉంటే తట్టుకోకపోవడం, మేము కష్టాల్లో ఉన్నామని ఏ పార్టీకి సంబంధించిన వ్యక్తులు వచ్చిన వెంటనే స్పందించి, సాధ్యమైనంత వరకు ఆదుకునే మనస్తత్వమే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బలహీనత అన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు ప్రజల కోసం, ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించడం ప్రజాప్రతినిధి బాధ్యత అన్నారు. ఆధారాలు లేకుండా ఈ గ్రామానికి, ఆ గ్రామానికి అంటూ అసత్య ప్రచారం చేయడం వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని ఘాటుగా స్పందించారు. విమర్శలు చేయడం సులువని, కానీ, ప్రజల కోసం నిరంతరంగా మద్దతుతో పనిచేయడం ఎమ్మెల్యే కు మాత్రమే చెల్లిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి కట్టిన పన్నుల నుంచే సగం నిధులను తిరిగి రాష్ట్రానికి ఇస్తుందని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణకు రావాల్సిన నిధులు కేంద్రమే పక్షపాతం వహిస్తూ బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేటాయిస్తున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గత మూడు సంవత్సరాల నుంచి బడ్జెట్ లో రాష్ట్రానికి మొండిచెయ్యి చూపుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేపై చౌకబారు రాజకీయాలు, అసత్య ప్రచారాలకు స్వస్తి చెప్పి అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు.

# రేపటితో వరి ధాన్యం కొనుగోలు పూర్తవుతాయి

- **చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక దృష్టితో మండలంలో దాదాపు అన్ని ధాన్యం కేంద్రాలు పూర్తయ్యాయని, అంకిరెడ్డిగూడెం కేంద్రం రేపటితో ముగుస్తుందని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సారి ఎపుడూ లేని విధంగా ధాన్యం వచ్చిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయడం జరిగింది అన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అధికారులను, నాయకులను అపమత్రం చేసి, ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఏఎంసీలో, అంకిరెడ్డి గూడెం, మల్కాపురం, ధర్మోజీ గూడెంలో (గిడ్డంగులు)గోదాం లు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. సహకరించిన ఎమ్మెల్యేకు, క్షేత్రస్థాయిలో సహకరించి రాత్రింబవళ్లు కష్టపడి పని చేసిన మునుగోడు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్యలతో పాటు వివిధ శాఖల అధికారులకు, వివిధ హోదాలో ఉన్న నాయకులకు, సహకరించిన రైతులకు అందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# నల్గొండలో భార్యాభర్తలు, పిల్లలను చంపింది ఒక్కడే



నల్గొండ: నల్గొండలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి దారుణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. దంపతులతో పాటు ఇద్దరు పిల్లలను చంపింది ఒక్కడేనని నిర్ధరించారు. ఇటీవల నల్గొండ తెలంగాణ కాలనీలోని ఇంట్లో భార్యాభర్తలు మహ్మద్ సుల్తాన్ (45), హసీనా (38)తో పాటు వారి కుమారుడు ముజామిల్ (20), కుమార్తె అఫోర (14) హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈనెల 20న తెల్లవారుజామున హత్యలు జరగ్గా.. 22న ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రధాన నిందితుడు సయ్యద్ అస్లాం, అతడి భార్య తబస్సుమ్‌తో పాటు వారికి పరోక్షంగా సహకరించిన సోహైల్, హేమంత్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్థిక లావాదేవీల కారణంగానే అస్లాం ఘాతుకానికి పాల్పడ్డాడు. అక్క కుమార్తె తబస్సుమ్, అస్లాంకు హసీనా ఏడాది క్రితం రూ.లక్ష అప్పు ఇచ్చారు. ఇటీవల మరో రూ.లక్ష కావాలని సుల్తాన్, హసీనా దంపతులను అస్లాం అడిగాడు. దానికి హసీనా నిరాకరించారు. గతంలో ఇచ్చిన డబ్బు తిరిగివ్వాలని కోరారు. డబ్బు కోసం ఒత్తిడి చేశారని తబస్సుమ్, అస్లాం వారిపై పగ పెంచుకున్నారు.అస్లాం యూట్యూబ్‌లో చూసి హత్యలకు పథకం పన్నాడు. ఈనెల 20 తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వచ్చిన హసీనాను తొలుత చంపాడు. ఆ తర్వాత అరుపుల శబ్దం విని బయటకు వచ్చిన సుల్తాన్, ముజామిల్‌ను కూడా అంతమొందించాడు. ఇంట్లో ఉన్న అఫోరను కూడా వదల్లేదు. ఇంట్లోకి వెళ్లి మరీ మంచం కింద దాక్కున్న అఫోరను కడతేర్చాడు. ఈ హత్యల తర్వాత ఇంట్లోని నగదు, బంగారు ఆభరణాలను అస్లాం దోచుకెళ్లాడు.

## వరుణుని రాక కోసం
# వేయి కళ్లతో ఎదురుచూస్తున్న రైతులు

* **నాటేసేందుకు సరిపడా నీరులేక వెనుకాడుతున్న అన్నదాతలు**
* **ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టలేక అయోమయంలో రైతన్నలు**




ప్రజా స్ఫూర్తి పాలేరు: సకాలంలో వర్షాలు కురవకపోవడం మరియు ఎల్‌నినో వంటి వాతావరణ మార్పుల ప్రభావంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ చెప్పినట్లే ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఖమ్మం జిల్లాలోని చాలా మండలాల్లో ఇప్పటివరకు వర్షాల జాడ లేదు. జూన్ చివరివారం వచ్చినప్పటికీ జిల్లాలో ఎక్కడా పెద్ద వానలు కురవలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే అసలు ఈ ఏడాది వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారనున్నది. ముఖ్యంగా వరిసాగుపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండనుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా వానల జాడ లేకపోవడంతో విత్తనాలు వేయలేక, వేసిన విత్తనాలు మొలవక, నారుమడులు ఎండిపోతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వర్షాభావ పరిస్థితులు వరి సాగుపై ప్రభావం చూపుతోంది. ఈ మధ్యన కురిసిన వానలకు వర్షాధార పంటలకు కాస్త ఊరట లభించింది. అయినా వరిసాగు చేస్తున్న రైతులకు మాత్రం నారుమళ్లు సిద్ధం చేసుకుని వరుణుడి రాక కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికీ ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు.

* **వర్షా ల లేమితో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు:**

విత్తనాలు మొలకెత్తకపోవడం తేమ లేని భూముల్లో విత్తనాలు నాటి, ఆకాశం వైపు వర్షం కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. విత్తనాలు మొలకెత్తక లేదా ఎండ తీవ్రతకు మొలకలు మాడిపోతుండటంతో పెట్టుబడి నష్టం వస్తోంది.నాట్లు వేయడంలో జాప్యం వరి నారుమడులు సిద్ధంగా ఉన్నప్పటికీ, పొలాల్లో తగినంత నీరు లేక, చెరువులు, కుంటలు అడుగంటడంతో నాట్లు వేయలేకపోతున్నారు.ప్రత్యామ్నాయ పంటల సందిగ్ధం వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు అటు వరి సాగు చేయలేక, ఇటు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టలేక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.ఈ తరుణంలోనే కాంప్లెక్స్ ఎరువుల ధరలను ప్రభుత్వం భారీగా పెంచి రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. వర్షాలు లేక వ్యవసాయ బోర్ల మీద, ట్యాంకర్ల మీద ఆధారపడాల్సి వస్తుండటంతో రైతులకు అదనపు ఆర్థిక భారం పడుతోంది. పంటల సాగు ఆలస్యం కావడం మరియు దిగుమతులు తగ్గిపోతాయనే భయంతో రైతులు అప్పుల పాలయ్యే ప్రమాదం ఉంది. వ్యవసాయ అధికారులు ప్రస్తుతం తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లోని రైతులకు ఆరుతడి పంటల వైపు మళ్లాలని సూచిస్తున్నారు. రైతులు తొందరపడి విత్తనాలు వేయకుండా, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విత్తనాలు వేయాలని వ్యవసాయ అధికారులు సూచించారు.

# డ్రగ్స్ పై సమాచారం ఇచ్చినవారికి ఐదువేలు నజరానా

* **మహబూబాబాద్ డీఎస్పీ నంబూరు తిరుపతిరావు**




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: ఓ యువతా మత్తువదిలి మంచిగ బతకాలని మహబూబాబాద్ డీఎస్పీ నంబూరు తిరుపతి రావు పిలుపు నిచ్చారు. శుక్రవారం మహబూబాబాద్ సబ్ జైల్లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. జైలర్ మల్లెల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ నంబూరు తిరుపతి రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత జైల్లోని ఖైదీలచే డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అనేవి యువతను నిర్వీర్యం చేస్తూ వారి భవిష్యత్తును అంధకారం చేస్తున్నాయన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు ఏరూపంలో వున్నా, సేవించినా, ఇతరులకు అమ్మినా రవాణా చేసినా తీవ్ర నేరంగా పరిగణించబడుతుందని హెచ్చరించారు.డ్రగ్స్ బారిన పడ్డ యువత తీవ్ర నేరాలకు పాల్పడుతుండడంతో వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని వాపోయారు. డ్రగ్స్ మహమ్మారిని తుదముట్టించేందుకు పోలీస్ శాఖ తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా గంజాయి సాగు, అమ్మకంతో పాటు ఉపయోగించే వారిపై నిరంతరం పోలీస్ డేగకన్ను ఉంటుందని హెచ్చరించారు.డ్రగ్స్ నిర్మూలన కోసం సమాజంలో భాద్యత కలిగిన ప్రతి పౌరుడూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఎక్కడ డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించినా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఇందుకు ఐదువేల రూపాయల పారితోషకం కూడా ఉంటుందని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.నేర అవినీతి రహిత సమాజమే తెలంగాణ పోలీస్ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్ రామరాజు, జైలు సిబ్బంది మహ్మద్ ఖలీల్, ఎమ్మెనో లక్ష్మన్, మోటపోతుల వీరన్న, పోషిని జనార్దన్, రామాంజనేయులు, నర్సింహారావుతో పాటు ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.



# మహనీయుల స్ఫూర్తిని రాబోయే తరాలకు అందించడమే విగ్రహా ఆవిష్కరణలు

* **మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : మహనీయుల స్ఫూర్తిని రాబోయే తరాలకు అందిం చడమే విగ్రహా ఆవిష్కరణలని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డినగర్ లో గల శివాజీ చౌక్ వద్ద భాగ్యనగర్ శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో 35 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని, రోడ్డు విస్తరణ మరియు డివైడర్ నిర్మాణం కారణంగా ప్రయాణికులకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 10 అడుగులు వెనుకకు జరిపి పునఃప్రతిష్ఠ చేశారు. శుక్రవారం భాగ్యనగర్ శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. అనంతరం ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ మహనీయుల జయంతి ఉత్సవాలు, వర్ధంతి సభలు మొక్కుబడిగా జరుగవన్నారు. ప్రపంచానికి ప్రాచీన నాగరికతను, సంస్కృతి సంప్రాదాయాలను అందించిన దేశం భారత్ అన్నారు. రామయణ ఇతిహాసం, మహా భారతం ఇతిహాసాన్ని అందించిన దేశం భారతదేశమన్నారు. ఛత్రపతి శివాజీ మహరాజు చరిత్ర ను అవగాహన చేసుకోవాలన్నారు. ఆయన ఆశయాలను పునికితెచ్చుకున్న దేశం భారత దేశమన్నారు. భాగ్యనగర్ శివాజీ సేవా సమితి అధ్యక్షులు నందనం దివాకర్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలను యువతకు చేరవేయడం, సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడం తమ లక్ష్యమని తెలిపారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించడం జరిగిందని పేర్కొన్నారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం భక్తులకు , ప్రజలకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో , తాజా మాజీ కార్పొరేటర్లు బి.విజయ్ శేఖర్ గౌడ్, రావుల శేషగిరిరావు, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జె.కె.శేఖర్ యాదవ్, నాయకులు చెరుకుపల్లి భరత్సింహా రెడ్డి, భాగ్యనగర్ శివాజీ సేవా సమితి ప్రధాన కార్యదర్శి మామిడాల రవీందర్, కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షులు సింధురెడ్డి శ్రీనివాస్, గార్గే శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, మణికంఠ, గజానంద్, శ్యామ్, నర్సింగ్, రమణ్, ఆశ లక్ష్మి, శిల్పిక తదితరులు, స్థానిక ప్రముఖులు, సమితి సభ్యులు , పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# 28న జరిగే సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి

* **నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి.**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 28న కనగల్ మండల కేంద్రంలో 13వేల కోట్ల వ్యయంతో నిర్మించే ఆర్ అండ్ బిహ్యం రోడ్ల పనుల పైలాన్ శంకుస్థాపన అనంతరం ఎన్జీ కళాశాలలో నిర్వహించే భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు.శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయంలో నలగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అధ్యక్షతన సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ విజయవంతంపై సన్నాహక సమావేశం, సర్ పై నల్లగొండ పట్టణ, మండలానికి సంబంధించి పార్టీ ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను అందజేస్తుందని తెలిపారు.ఈనెల 28న జరిగే సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ చారిత్రాత్మకంగా నిలుస్తుందన్నారు.నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు సవరణ కార్యక్రమం పై ఎవరు నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తలంతా దీనిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి, నల్లగొండ డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి శ్రీనివాస్, తిప్పర్తి,నల్లగొండ పిఏసిఎస్ చైర్మన్ లు ఆలకుంట నాగరత్నం రాజు, పాశం సంపత్ రెడ్డి,పలువురు కార్పొరేటర్లు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు,పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు



ఒకప్పుడు చందమామను చూపిస్తూ.. గోరుముద్దలు తినిపించేది అమ్మ! పిల్లాడు ఆరోగ్యంగా పెరిగేవాడు. ఇప్పుడు.. సెల్‌ఫోన్ చేతికిచ్చి, ముద్దలు తినిపిస్తుంది. నాన్నేమో.. ట్యాబ్ చూపిస్తూ లాల పోస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదుగుతున్న చిన్నారులను.. పసితనంలోనే అనేక రుగ్మతలు చుట్టుముడుతున్నాయి. పెరుగుతున్న సాంకేతికత కొన్నిరకాల వ్యాధులకు కారణం అవుతున్నది. అందులో ఒకటి ఆటిజం. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వాడకం పెరిగేకొద్దీ ఆటిజం సమస్య హెచ్చుతున్నది.

# ఎండలో ఇవి చేయకండి!

ఎండాకాలం వచ్చిందంటే చర్మానికీ, శరీరానికీ అవసరాలు మారతాయి. దానికి తగ్గట్టు కొన్ని విషయాల్లో మనమూ మారతాం. అక్కడే తప్పు చేసే అవకాశం ఉంది. ఇవి అవసరాలు కాదు, అనర్థాలు అంటున్నారు చర్మ, ఆరోగ్య నిపుణులు.

### ఇంట్లో అక్కర్లేదు

సన్‌స్క్రీన్ బయటికెళ్లేప్పుడు మాత్రమే రాసుకోవాలి. ఇంట్లో ఉన్నా, కారులో వెళ్తున్నా అక్కర్లేదు అనుకోవడం అపోహ మాత్రమే. మనం ఎక్కడ ఉన్నా మన చుట్టూ ఉండే వెలుతురులో చర్మానికి హాని చేసే అతినీల లోహిత కిరణాలు ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఈ సమయంలో సన్‌స్క్రీన్ వాడాలి.

### కడుగుతూనే ఉండాలి

ఎండాకాలం వచ్చిందంటే అదేదో యాడ్‌లో 'కడుగు బాబు కడుగు' అన్నట్టు మొహాన్ని మాటి మాటికీ నీళ్లతో కడుగుతుంటారు. ఇది ఎండవేళ చర్మానికి హాయిని కలిగించి, తేమగా ఉంచుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఇలా మాటిమాటికీ నీటితో చర్మాన్ని కడగడం వల్ల 'ట్రాన్స్ ఎపిడెర్మల్ వాటర్ లాస్ (టీఈడబ్ల్యూఎల్)' అని పిలిచే ప్రత్యేక పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిబారుతుంది.

### అదైతే చాలు

వేసవిలో ఏ వీధి మూలన చూసినా మజ్జిగ, పుదీనా రసం కుండలు, జీరా నీళ్లు, నిమ్మరసాలు దొరుకుతుంటాయి. ఎండవేళ చలువ చేస్తాయన్న ఉద్దేశంతో వాటిని స్వేచ్ఛగా తాగుతుంటారు. కానీ, ఇలా బయట దొరికేవి తాగేప్పుడు అక్కడ ఎంత పరిశుభ్రత పాటిస్తున్నారు, ఎలాంటి నీళ్లు వాడుతున్నారులాంటివి గమనించాలి. లేకపోతే పొట్టకు లేనిపోని తంటా తెచ్చినట్టే.

### అన్నీ తాగొచ్చు

ఎండవేళ శరీరంలో నీటి స్థాయుల్ని నిలిపి ఉంచేందుకు ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కాబట్టి మంచీ చెడులతో సంబంధం లేకుండా ఏమైనా తాగొచ్చు అనుకోవడం పొరపాటు. కేవలం మజ్జిగ, కొబ్బరినీళ్ల లాంటి సంప్రదాయ ఆరోగ్యకర పానీయాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. మిల్క్‌షేక్‌లు, శీతల పానీయాల్లాంటి హై క్యాలరీ డ్రింకులను ఏ కాలంలో అయినా పక్కన పెట్టేయాల్సిందే.



# ఆటిజం.. అరువు తెచ్చుకుంటున్నం!

**మన దేశంలో ప్రతి 80మంది చిన్నారుల్లో ఒకరికి ఆటిజం సమస్య ఉండవచ్చనేది ఒక అంచనా. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఆటిజంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా ఏప్రిల్ 2న 'వరల్డ్ ఆటిజం అవేర్‌నెస్ డే' నిర్వహిస్తున్నది. అసలు ఈ ఆటిజం అంటే ఏంటి, అది ఎందుకు వస్తుంది, రావడానికి గల కారణాలేంటి? దాని లక్షణాలు, ఆటిజం వల్ల పిల్లల్లో ఎలాంటి అనారోగ్యం ఏర్పడుతుంది? ఈ సమస్యను ఎలా గుర్తించాలి, నిర్ధారణ పద్ధతులు, చికిత్సా విధానం తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.**

**ఆటిజం** అనేది బయటికి కనిపించే ఒక రకమైన మానసిక వ్యాధి లక్షణం. చాలా ఆటిజం కేసుల్లో మాటలు మొదట్లో వస్తాయి. కానీ రెండేండ్లు వచ్చేసరికి మాటలు ఆగిపోతాయి. దీనినే 'రిగ్రెషన్' అంటారు. చాలామంది పిల్లల్లో మొదటి రెండేండ్లలోపే ఇది జరుగుతుంది. ఆటిజం సమస్య ఉన్న చిన్నారుల్లో నాలుగైదు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి.

1. భావ వ్యక్తీకరణ లేకపోవడం. అది భాష పరంగా గానీ, హావభావాలు వ్యక్తపరచడంలో గానీ సమస్య ఉంటుంది. అంటే వాళ్లు సరిగ్గా మాట్లాడలేరు.
2. ఇతరుల భావాలను గ్రహించలేరు. అంతేకాదు వారి భావోద్వేగాలను వ్యక్తపర్చలేరు.
3. సామాజిక బాంధవ్యాలు తెలియదు. అంటే ఇతరులతో కలిసి ఆడుకోవడం, కలివిడిగా ఉండటానికి ఇష్టపడరు. ఒంటరిగా ఉండాలని కోరుకుంటారు.
4. చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తుంటారు.
5. ఈ చిన్నారుల్లో మానసిక పరిణతి తక్కువగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ ఆటిజం పిల్లల్లో ప్రాథమికంగా కనిపిస్తుంటాయి. ఈ సమస్యలతో సతమతమవుతున్న వారిని ఆటిజం బాధితులుగా పరిగణిస్తారు.



### కారణాలు

- ఆటిజం సమస్యకు ఒక ప్రత్యేకమైన కారణమని ఏదీ లేదు. సాధారణంగా 9 నెలల నుంచి 18 నెలలు వచ్చే వరకు పిల్లలు భావాలను వ్యక్తీకరించడంతో పాటు, గ్రహించడం, భాష నేర్చుకోవడం చేయగలుగుతారు. ఈ వయసులో చిన్నారులకు ఫోన్‌లు, టీవీ, ట్యాబ్ లాంటివి అలవాటు కావడం వల్ల భావ వ్యక్తీకరణ, భాష నేర్చుకోవడం దెబ్బతింటుంది. స్క్రీన్ టైమ్‌కి అలవాటు పడితే ఈ సమస్యలు వస్తాయి.

అమెరికన్ పీడియాట్రిక్ సొసైటీ ప్రకారం మొదటి 3 సంవత్సరాల వరకు పిల్లలను ఫోన్, టీవీకి దూరంగా ఉంచడం మంచిది. వాటికి అలవాటుపడితే ఆటిజం వచ్చే ప్రమాదం ఉందని సదరు సొసైటీ హెచ్చరించింది.

- బహుళ భాషలను నేర్చుకోవాల్సి రావడమూ పిల్లల్లో ఆటిజం సమస్యకు కారణం కావొచ్చు. చిన్నారులకు మాటలు వచ్చే క్రమంలో.. తల్లిదండ్రులు వేర్వేరు భాషల్లో మాట్లాడటం వల్ల, పిల్లలకు ఏ భాషను స్వీకరించాలో అర్థం కాదు. వాళ్లు అయోమయానికి గురై భాషపై పట్టుచిక్కకపోవడం వల్ల ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి.
- యాంటీ బయోటిక్స్ లాంటి ఔషధాలు ఎక్కువగా వాడటం కూడా ఆటిజానికి దారి తీయొచ్చు.
- ఐవీఎఫ్ ద్వారా జన్మించిన పిల్లల్లో కూడా ఆటిజం రిస్క్ కనిపిస్తున్నది.
- 18 నెలల వయసులో పిల్లలకు ఇచ్చే ఎంఎంఆర్ టీకా వల్ల కూడా ఆటిజం వస్తుందనేది ప్రజల్లో ఉన్న ఒక అపోహ మాత్రమే. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవు.

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పిల్లల పెంపకంలో పెద్దల పాత్ర అధికంగా ఉండేది. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, మేనమామ, అత్తయ్య, చిన్నాన్న, పిన్ని... ఇలా ఎవరో ఒకరు పిల్లలతో సమయం గడిపేవారు. అప్పట్లో సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌ల ఊసే లేదు. మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఎక్కువగా ఉండేది. నిరంతరం వారి మధ్య ఉండటం వల్ల పిల్లల్లో భాషా వికాసం బాగా ఉండేది. హావభావాల వ్యక్తీకరణతో పాటు మానసిక పురోగతిలోనూ వయసుకు తగ్గ పరిణతి కనిపించేది. కానీ, ఇప్పుడు ఉమ్మడి కుటుంబాల ఉనికి గణనీయంగా తగ్గిపోయింది. నూటికి 90 శాతం న్యూక్లియర్ ఫ్యామిలీలే ఉంటున్నాయి. దీనికితోడు తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం వల్ల పిల్లలు అధిక సమయం ఒంటరిగా గడపాల్సి వస్తున్నది. మనుషులతో కన్నా డిజిటల్ కమ్యూనికేషన్ ఎక్కువైంది. ఏడాది వయసున్న పిల్లలు కూడా సెల్‌ఫోన్, ట్యాబ్‌తో ఆడుకోవడం కనిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితులు సైతం ఆటిజానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు.

### రోగ నిర్ధారణ పద్ధతులు

**ప్రత్యేక** లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. ఆటిజాన్ని నిర్ధారించేందుకు ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి వైద్య పరిజ్ఞానం గానీ, రోగ నిర్ధారణ పద్ధతులు గానీ అందుబాటులో లేవు. కేవలం అనుభవజ్ఞులైన సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు మాత్రమే సమస్యను కొన్ని రకాల పరీక్షల ద్వారా నిర్ధారించగలరు.

### లక్షణాలు

- పిల్లలు తల్లిదండ్రుల కండ్లలోకి కూడా నేరుగా చూడలేకపోవడం
- పేరుపెట్టి పిలిచినా వెంటనే స్పందించకపోవడం
- ఇతర పిల్లలతో కలిసి ఆడుకోకపోవడం
- ఒంటరిగా ఉండేందుకే ఇష్టపడటం
- ఒకే రకమైన బొమ్మతో మాత్రమే ఆడుకోవడం, మరో బొమ్మ ఇస్తే తీసుకోకపోవడం
- కొందరు పిల్లల్లోనైతే స్పర్శ, వాసన, చూపు, వినికిడి వంటి జ్ఞానేంద్రియ వ్యవస్థ అసంబంధ్ధంగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ మొదటి మూడు సంవత్సరాల్లోపు కనిపిస్తాయి.

### చికిత్సా పద్ధతులు

ఆటిజానికి సంబంధించిన లక్షణాలను ఎంత త్వరగా గుర్తించి, సరైన థెరపీలను అందించగలిగితే అంత మంచిది. 6 నెలల్లోనే 50 శాతం సమస్యను నివారించవచ్చు. కనీసం 3 సంవత్సరాల్లోపు సమస్యను గుర్తించి చికిత్స అందిస్తేనే ఫలితం ఉంటుంది. ఈ 3 సంవత్సరాల గోల్డెన్ టైమ్ దాటిపోతే ఎలాంటి చికిత్సలు అందించినా ఫలితం ఆశించిన మేరకు ఉండకపోవచ్చు. ఆటిజం బాధిత చిన్నారులకు ప్రధానంగా మూడు రకాల థెరపీలతో చికిత్స అందిస్తారు. అందులో 1.ఆక్యుపేషనల్ థెరపీ 2. బిహేవియర్ థెరపీ 3. స్పీచ్ థెరపీ

#### 1.ఆక్యుపేషనల్ థెరపీ:

పిల్లల్లో ప్రారంభ దశలో జ్ఞానేంద్రియాలు అసంబద్ధంగా ఉన్నట్లు గుర్తిస్తే, ఆక్యుపేషనల్ థెరపీ అందించవచ్చు. దీని వల్ల ఐదు జ్ఞానేంద్రియాలు నియంత్రణలోకి వచ్చి, సమస్య దాదాపుగా పరిష్కారమవుతుంది.



#### 2.బిహేవియర్ థెరపీ:

బిహేవియర్ థెరపీతో పిల్లల అసాధారణ ప్రవర్తనకు సంబంధించిన సమస్యలు పరిష్కరించవచ్చు.

#### 3. స్పీచ్ థెరపీ:

ఆటిజం పిల్లల విషయంలో స్పీచ్ థెరపీ చాలా ముఖ్యమైంది. మొదటి రెండు థెరపీలు... అంటే ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీల తర్వాతే స్పీచ్ థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది.

### సలహాలు

- ప్రారంభ దశలోనే గుర్తించి నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.
- మూడేండ్లలోపు పిల్లలను బ్లూ లైట్‌కు దూరంగా ఉంచాలి. అంటే సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, టీవీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఇవ్వకూడదు.
- పిల్లలకు ఎలక్ట్రానిక్ పరికరాలు ఇచ్చి, ఒంటరిగా వదిలేయకుండా వారితో తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యులు గడపడం ఉత్తమం.





# నిద్రలోనూ సుఖం లేదు!

**శారీరక** శ్రమకు, మానసిక ఆందోళనకు చక్కని ఔషధం నిద్ర. ఆరు గంటలు ఆదమరచి నిద్దరోతే.. సమస్యలన్నీ పరారైన అనుభూతి కలుగుతుంది. కానీ, సుఖమెరుగని నిద్ర.. అతివలకు అంతగా అందడం లేదని సర్వేల సారాంశం. స్లీప్ ఫౌండేషన్ ఇచ్చిన నివేదిక.. పురుషుల కన్నా స్త్రీలు నిద్రలేమితో ఎక్కువగా బాధపడుతున్నారని తేల్చింది. ఉద్యోగం, ఇల్లు, పిల్లలు, ఇతర బాధ్యతలతో మల్టీ టాస్కింగ్ చేస్తున్న మహిళలు సరైన నిద్ర లేక సతమతమవుతున్నారని నివేదిక సారాంశం. ఇందుకు కారణాలూ లేకపోలేదు. రుతుక్రమంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్లలో హెచ్చుతగ్గులు నిద్రకు భంగం కలిగిస్తాయి. ముఖ్యంగా రుతుస్రావం ముందు, మెనోపాజ్ సమయంలో వేడి ఆవిర్లు, రాత్రి చెమటలు నిద్రను భంగపరుస్తున్నాయని పరిశోధకులు తేల్చారు. అంతేకాదు గర్భిణిగా ఉన్నప్పుడు హార్మోన్లలో చోటుచేసుకునే మార్పుల కారణంగా శారీరక అసౌకర్యం ఏర్పడుతుంది. ఇది నిద్ర నాణ్యతపై గణనీయంగా ప్రభావం చూపుతుందట. ఈ నిద్రలేమి హృదయ సంబంధ వ్యాధులు, మానసిక రుగ్మతలకు దారి తీస్తుందని ఆరోగ్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుఖనిద్రకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

# స్నానం తర్వాత బ్రషింగా?

**ఒక్కోసారి** హడావుడిగా, ఏదో ఆలోచనలో ఉండి బ్రష్ చేసుకోలేదనే విషయం మరిచిపోయి స్నానం చేసేస్తుంటాం. తర్వాత గుర్తొచ్చి అప్పుడు బ్రష్ చేసుకుంటాం. ఇది ఎప్పుడో పొరపాటున ఒకసారి జరిగితే పర్వాలేదు. కానీ, అదే అలవాటుగా మారితే మాత్రం చర్మానికి నష్టమేనని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. మనం పళ్లు తోముకున్నప్పుడు బ్యాక్టీరియా నోటి నుంచి చర్మం మీదకు చేరే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నోటి చుట్టూ, గడ్డం చుట్టూ ఇరిటేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. తర్వాత అది నెమ్మదిగా మొటిమలకు కారణమవుతుంది. బ్రష్ చేసే సమయంలో చర్మం మీదికి బదిలీ అయిన బ్యాక్టీరియా వల్ల చర్మం మీద పగుళ్లు కూడా ఏర్పడవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే స్నానానికి ముందే బ్రష్ చేసుకోవడం సురక్షితం. ఒకవేళ స్నానం తర్వాత బ్రష్ చేయాల్సి వస్తే ముఖాన్ని మరోసారి సబ్బుతో లేదా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు.



# ముందే తినేయాలి!

**రోజూ వీలైనంత త్వరగా భోజనంచేస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గుతుందట. నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 1,03,389 మంది నుంచి ఆహార విధానాలు, గుండె రక్తనాళాల జబ్బులకు సంబంధించిన సమాచారం సేకరించారు. వీరిలో 79 శాతం మంది మహిళలే. పరిశోధనలో పాల్గొన్నవాళ్ల సగటు వయసు 42 ఏండ్లు..**

**వయసు,** లింగం, కుటుంబ పరిస్థితి మొదలైన సామాజిక పరిస్థితులు, ఆహారంలో పోషకాల నాణ్యత, జీవనశైలి, నిద్రా చక్రాన్ని పరిశోధకులు పరిగణనలోకి తీసుకున్నారు. పొద్దున్నే టిఫిన్ చేయకుండా భోజనం చేసేవారిలో ఒక్కో గంట ఆలస్యానికి గుండె రక్తనాళాల వ్యాధుల తీవ్రత 6 శాతం పెరుగుతుందని పరిశోధకులు కనుక్కొన్నారు. అంటే పొద్దునే 9 గంటలకు తినే వ్యక్తికి 8 గంటలకే తిన్న వ్యక్తితో పోలిస్తే గుండె రక్తనాళాల జబ్బుల ముప్పు 6 శాతం ఎక్కువగా ఉంటుందన్నమాట. 9 తర్వాత ఒక్కో గంట గడుస్తుంటే ఈ ముప్పు 28 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. అయితే, ముందురోజు రాత్రి చివరి భోజనానికి, తర్వాతి రోజు ఉదయం భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తక్కువట. అలా ఈ పరిశోధన రోజూ పొద్దున, సాయంత్రం భోజనాలు వీలైనంత త్వరగా ముగించేయాలని వెల్లడిస్తున్నది. గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం ప్రపంచ ప్రజల్లో మరణాలకు కారణమయ్యే వ్యాధుల్లో గుండె రక్తనాళాల సమస్యలే ముందువరుసలో ఉన్నాయి.



2019లో గుండె సమస్యలతో 18.6 మిలియన్ల మంది మరణించారు. వీటిలో 7.9 శాతం మరణాలకు ఆహారపు అలవాట్లే ప్రధాన కారణంగా నిలిచాయి. అంటే... ''ఈ తరహా వ్యాధుల పుట్టుక, అభివృద్ధిలో ఆహారం కీలకపాత్ర పోషిస్తున్నదని తెలుస్తుంది. పశ్చిమ దేశాల సమాజాల ఆధునిక జీవనశైలి రాత్రి భోజనం మరీ ఆలస్యంగా చేయడం, పొద్దునే టిఫిన్ తీసుకోకపోవడం మొదలైన ఆహారపు అలవాట్లకు దారితీసింది. అయితే, ఉదయం, రాత్రి భోజనాలు వీలైనంత తొందరగా ముగించుకునే అలవాట్లను స్వీకరిస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గించుకోవచ్చు'' అని పరిశోధకులు పేర్కొన్నారు.

# గ్లైఫోసేట్.. గర్భిణులకు ముప్పు



**గ్లైఫోసేట్‌ను** పంటల్లో కలుపు నివారణకు వాడతారు. ఇది పంటలకు హాని కలిగించకుండానే కలుపును నిర్మూలిస్తుంది. కాబట్టి, రైతులు దీన్ని విస్తృతంగా వాడుతున్నారు. ఏండ్ల తరబడి జరిగిన అధ్యయనాల ద్వారా గ్లైఫోసేట్ మనుషుల్లో క్యాన్సర్‌కు కారణం కావచ్చని భావిస్తున్నారు. ఆహారం రూపంలో అంతగా హాని కలిగించనప్పటికీ గ్లైఫోసేట్ ఆధారిత రసాయనాలు మనుషులను వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. చర్మం మండుతుంది. శ్వాసిస్తే ముక్కు రంధ్రాల్లో ఇబ్బందిగా ఉంటుంది. కొన్నిసార్లయితే తీవ్రతను బట్టి కాలేయం, కిడ్నీల పనితీరును దెబ్బతీస్తుంది. మరణం కూడా సంభవించవచ్చు. అంతేకాదు... గ్లైఫోసేట్ గర్భిణుల మీద మరింత దుష్ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయం ఏ కొంచెం తగ్గినా కూడా పుట్టబోయే శిశువు జీవితంపై ప్రతికూల ప్రభావాలకు దారితీస్తుంది. పైగా బిడ్డ పుట్టకముందే శాశ్వత నష్టం కూడా జరగవచ్చు. బిడ్డ పుట్టిన తర్వాత కూడా శరీర పెరుగుదలకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి. గర్భిణులపై గ్లైఫోసేట్ ప్రభావం గురించి అమెరికాకు చెందిన 'ది ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ యూనిట్' జరిపిన సర్వేలో ఈ వివరాలు తెలిశాయి.

అధ్యయనం కోసం పరిశోధకులు 18– 40 సంవత్సరాల మధ్య వయసున్న 77 మంది మహిళల్ని ఎంచుకున్నారు. వీరిని 2015 జూన్ నుంచి 2016 జూన్ వరకు పరీక్షించారు. వీరి మూత్రం నమూనాల్లో దాదాపు 93 శాతం మందిలో గ్లైఫోసేట్ అవశేషాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నట్టు గుర్తించారు. పట్టణ మహిళలతో పోలిస్తే గ్రామీణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. మొదట్లో దీనికి కారణం నీళ్లు కావచ్చని అనుకున్నారు. కానీ కలుపు నివారణకు గ్లైఫోసేట్ వాడటం వల్ల ఆయా పంటలను ఆహారంగా తీసుకోవడంతో ఈ దుస్థితి దాపురించిందని ఇప్పుడు అనుమానిస్తున్నారు. ఇది చిన్న అధ్యయనమే అయినప్పటికీ ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలనేది పరిశోధకుల హెచ్చరిక. మరో విషయం... గర్భిణులు తమ తొలి మూడు నెలల కాలంలో ఈ కలుపు నివారిణికి దూరంగా ఉండాలంటున్నారు పరిశోధకులు. లేదంటే తల్లిపాల ద్వారా కలుపుమందు అవశేషాలు పిల్లలకు చేరుకుంటాయి. కాబట్టి, రైతులు కూడా గ్లైఫోసేట్‌కు ప్రత్యామ్నాయాలను వాడాలి. గర్భిణులు తొమ్మిది నెలలపాటు ఈ కలుపుమందు ప్రభావం అసలే పడకుండా జాగ్రత్త వహించాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

సినిమా

# NABHA NATESH




# ఐటెం సాంగ్‌లో ఇస్మార్ట్ బ్యూటీ స్టెప్పులు

ఓ యాక్సిడెంట్ కారణంగా తెలుగు సినిమాలకు మూడేళ్ల పాటు దూరమైన నభా నటేష్ మళ్లీ ట్రాక్‌లో పడుతోంది. తాజాగా ఈ ఇస్మార్ట్ బ్యూటీ తెలుగులో మరో బంపర్ ఆఫర్ అందుకుంది. మాస్ మహారాజా రవితేజ సినిమాలో ఛాన్స్ దక్కించుకున్నట్లు సమాచారం. అయితే హీరోయిన్‌గా కాదండోయ్. స్పెషల్ సాంగ్‌లో ఆడిపాడనుందట. రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందుతోన్న ఇరుముడి మూవీలోని ఓ స్పెషల్ సాంగ్‌లో స్టెప్పులేయనుందట. ఈ కన్నడ బ్యూటీ కంటే ముందు కొందరు బాలీవుడ్‌తో పాటు దక్షిణాది హీరోయిన్ల పేర్లను పరిశీలించారట మేకర్స్. చివరకు నభానే ఫైనల్ చేశారట. హైదరాబాద్‌లో వేస్తున్న ఓ గ్రాండ్ సెట్‌లో త్వరలోనే ఇద్దరిపై గ్రాండియర్‌గా ఐటెంసాంగ్‌ను చిత్రీకరించబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ మూవీ ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రస్తుతం తెలుగులో నాగబంధంతో పాటు నిఖిల్ స్వయంభూ సినిమాలు చేస్తోంది ఈ చిన్నది.

## నాన్న సినిమాలో నటించను

కోలీవుడ్ స్టార్ హీరోలు రజనీకాంత్, కమల్‌హాసన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ధర్మన్ మూవీ ఇటీవల లాంఛ్ అయ్యింది. ఈ మూవీలో నటించేందుకు తండ్రి ఆఫర్ చేయగా శృతి హాసన్ రిజెక్ట్ చేసిందట. ఇందులో సీనియర్ హీరోయిన్ సిమ్రాన్‌తో పాటు రాశీఖన్నా కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. కాగా రాశీఖన్నా పాత్ర కోసం మొదట శృతినే తీసుకోవాలని కమల్‌హాసన్ అనుకున్నారట. కానీ ఆమె ఒప్పుకోలేదట. కమల్‌హాసన్ వల్లే ఛాన్స్ వచ్చిందని విమర్శలు వస్తాయని అనుకొని నటించొద్దని నిర్ణయించుకుందట. ఈ రోల్ కోసం తానే రాశీఖన్నా పేరును సజెస్ట్ చేసిందట కూడా. కాగా ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తోన్న ఆకాశంలో ఒక తార సినిమాలో ఓ స్పెషల్ రోల్‌లో కనిపించబోతుంది ఈ చిన్నది. ఈ మూవీకి అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్నారు.






## ఎందుకురా ఓర్వలేనితనం..

- ఇడుపుకాయితం మూవీ టైటిల్‌పై ఆంధ్రావాళ్ల ట్రోల్స్
- నోరు మూసుకోండంటూ ఫైరైన గంటా చక్రపాణి

ప్రియదర్శి హీరోగా నటిస్తోన్న ఇడుపుకాయితం మూవీ టైటిల్‌పై వస్తున్న కామెంట్లతో సోషల్ మీడియా షేక్ అవుతోంది. ఇది ఏ భాష సినిమా.. ఆంధ్రాలో తెలుగు డబ్బింగ్ ఉంటుందా? సబ్ టైటిల్స్ వేస్తారా? అంటూ తెలంగాణ యాస, భాషలను కించపరిచేలా కామెంట్లు పెడుతోన్నారు. ఇడుపు కాయితం టైటిల్ చూసి తమిళ డబ్బింగ్ సినిమా అనుకున్నానని ఓ నెటిజన్ పేర్కొన్నాడు. ప్యూర్ తెలంగాణ యాసతో సినిమా చేస్తే మరి ఆంధ్రా వాళ్లకు ఎలా అర్థం అవుతుంది అంటూ మరొకరు పోస్ట్ పెట్టారు. వీటిపై తెలంగాణవాదులు స్పందిస్తూ ఫైరవుతున్నారు. "ఇడుపు కాయితం అంటే విడిపోయేటప్పుడు రాసుకునే ఒక పత్రమది. ఎందుకురా ఇంత ఓర్వలేనితనం. మరి "విడాకులు"లో ఏముందిరా! ఆకులా? అర్థం కాకపోతే మూసుకోండి. సబ్ టైటిల్స్ ఉండవు. చూడకండి" అంటూ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఆగ్రహం వ్యక్తం చేశారు.

తమిళ, మలయాళ సినిమాలను అదే పేరుతో తెలుగులో రిలీజ్ చేస్తే చూడటానికి రాని ఇబ్బంది తెలంగాణ సినిమాలకే వస్తుందా అంటూ ఓ నెటిజన్ ఘాటుగా రియాక్ట్ అయ్యారు. మధుర శ్రీధర్ రెడ్డితో పాటు మరికొందరు తెలంగాణ దర్శకులు దీనిపై రియాక్ట్ అయ్యారు. మేకర్స్‌తో పాటు ప్రియదర్శిన్, నాగదుర్గతో పాటు ఇతర నటీనటులు మాత్రం రియాక్ట్ కాలేదు. మొత్తానికి రావాల్సినంత పబ్లిసిటీ ఓపెనింగ్ రోజే వచ్చేసిందని సినీ వర్గాలు అంటున్నాయి. ఈ మూవీని డైరెక్టర్ సుకుమార్‌తో కలిసి బన్నీ వాస్ నిర్మిస్తుండగా వంశీ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు.

## అంత్యక్రియలు పూర్తి.. అయినా మిస్టరీనే

ఆత్మహత్య చేసుకున్న తొమ్మిది రోజుల తర్వాత ఎట్టకేలకు బాలీవుడ్ నటి సంచితా ఉగాలే అంత్యక్రియలు జరిగాయి. అహల్యనగర్ జిల్లాలోని అకోలాకు సమీపంలో ఉన్న డోంగర్‌గావ్‌కు భౌతిక కాయాన్ని తరలించిన కుటుంబసభ్యులు సొంతూరిలో ఆమె అంతిమ సంస్కారాలతో పాటు దశకర్మలను పూర్తి చేశారట. సంచితా మరణంపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడంతోనే అంత్యక్రియలు ఆలస్యమైనట్లు సమాచారం. కాగా ఉజ్వల్ శర్మ వేధింపుల వల్లే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపణలు వస్తుండగా అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. హిందీలో కుంకుమ్ భాగ్య, వాగ్లే కీ దునియా, దిల్‌వాలీ దుల్హా లే జాయేగీ, సాజన్ ఘర్‌తో పాటు పలు టీవీ సీరియల్స్ చేసింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.